



ఓటు.. ఓ డౌటు

- తుది జాబితా ప్రచురణ తర్వాత వచ్చిన దరఖాస్తులు 18,920
- మళ్లీ 5814 ఫాం7ల దాఖలు
- ఫాం7ల విషయంలో కొనసాగుతున్న పాలక పార్టీ కుయుక్తులు
- ఓట్లు తొలగించే విషయంలో ఈసీ నిర్ణయమే ఫైనల్
- చేర్పుల విషయంలో యంత్రాంగానికే వెసులుబాటు

బాపట్ల, ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది జనవరి 22న ఓటర్ల తుది జాబితాను ఈసీ విడుదల చేసిన సంగతి తెలిసిందే. దీనికి రెండు వారాల ముందే ఆనలైన్‌లో ఓట్లకు సంబంధించి ఫాంలను దరఖాస్తు చేసే అవకాశాన్ని ఫ్రీజ్ చేసిన ఈసీ తిరిగి జనవరి 23 నుంచి అందుకు అవకాశం కల్పించింది. అప్పటి నుంచి ఫిబ్రవరి 19 వరకు వచ్చిన మొత్తం దరఖాస్తులు 18,920. ఇందులో ఫాం6లు 7334 కాగా, ఫాం7లు 5814, ఫాం8లు 5772గా ఉన్నాయి. ఫాం6, 8ల విషయంలో గతంలో నిబంధనలే ఉండగా ఫాం7 ద్వారా ఓటు తొలగించాలంటే నిర్దిష్టమైన మార్గదర్శకాలను ఇప్పటికే ఈసీ జారీ చేసింది. గతంలో జిల్లాలో ముఖ్యంగా పర్చూరులో ఫాం7ల విషయంలో అనేక ఆరోపణలు రావడంతో పాటు పోలీసు అధికారులు సస్పెన్షన్‌కు కూడా గురి కావడం జరిగిన సంగతి తెలిసిందే. వీటన్నింటి నేపథ్యంలో మళ్లీ జిల్లావ్యాప్తంగా 5,814 ఫాం7లు ఈ నాలుగు వారాల వ్యవధిలోనే రావడం, అందులో 843 పర్చూరుకు సంబంధించినవే ఉండడం గమనార్హం.



ఇలా విచారించాలి..

తుది ప్రచురణ దగ్గర నుంచి ఇప్పటివరకు 5814 ఫాం7లు వచ్చాయి. నియోజకవర్గాల వారీగా ప్రచురించిన తుది జాబితాలోని ఓట్లు కొలమానంగా ఇందులో 0.1 శాతం లోపు మాత్రమే ఫాం7ల ద్వారా ఓట్ల తొలగింపు జిల్లా కలెక్టర్ ఆమోదంతో జరగాల్సి ఉంటుంది. ఆ శాతానికి మించి తొలిగించాల్సి వస్తే ఆ పేర్లను సీఈవో కార్యాలయానికి పంపి అక్కడ తుది ఆమోదం లభించాకే ముందుకు వెళ్లాలి. లేకుంటే వాటిని తిరస్కరణ జాబితాలోనే చేర్చాలి. ఇప్పటికే వీటిలో కొన్నింటిపై విచారణ పూర్తి చేసిన యంత్రాంగం వాటిని కలెక్టర్ లాగిన్ లోకి పంపారనేది సమాచారంగా ఉంది.

అధికారపార్టీ తీరుపైనే అనుమానాలు...

గతంలో ఫాం7లను పాలకపార్టీ సానుభూతిపరులు గంపగుత్తగా దరఖాస్తు చేసేవారు. ఈసీ నిబంధనలు కఠినతరం చేయడంతో రూటు మార్చి ఇప్పుడు ఒక్కొక్కరు 5కు లోబడి ఫాం7లను నమోదు చేసే ప్రక్రియను కొనసాగిస్తూనే ఉన్నారని ఆరోపణను టీడీపీ చేస్తోంది. వాటిని దాఖలు చేసిన వారి పూర్వాపరాలపై కూడా విచారణ చేసి తుది నిర్ణయానికి రావాలని విపక్షాలు కోరుతున్నాయి. నేతల ఒత్తిళ్ల పర్వంమీద కూడా గతంలో ఆరోపణలు వచ్చాయని, ఇప్పుడు కూడా కొనసాగిస్తున్నారనే విమర్శను టీడీపీ చేస్తోంది. ఓట్ల తొలగింపు కోరుతూ దాఖలైనా 5,814 దరఖాస్తుల్లో దాదాపు 2,000 వరకు గతంలో యంత్రాంగం తిరస్కరించినవే ఉన్నాయని తెలుస్తోంది. ఈ విషయంలో పాలకపార్టీ మద్దతుదారులు పదేపదే ఫాం7లను దాఖలు చేస్తూ యంత్రాంగానికే సవాల్ విసురుతున్నారు.

కేసులు నమోదుతో సరి.. చర్యలేవీ..

పర్చూరు నియోజకవర్గ ఈఆర్‌వో ఫిర్యాదు మేరకు 22 మందిపై పోలీసులు కేసులు నమోదు చేసిన సంగతి తెలిసిందే. వీరితో పాటు మరో 23మందిపై పోలీసులు స్వచ్ఛందంగా కేసు నమోదు చేశారు. ఇదంతా జరిగి నెలలు గడుస్తున్నాయి. కానీ వారిపై చర్యలు కొరవడ్డాయి. కేవలం కేసులు నమోదుతో సరిపెట్టారే తప్పితే వాటి పురోగతి విషయంలో ఇప్పటి వరకు అంగుళం కదలిక కనబడకపోవడాన్ని టీడీపీ తప్పుబడుతోంది. ఇంత జరిగినా మళ్లీ యథేచ్ఛగా ఫాం7లు దాఖలవడానికి కారణం చర్యలు ఉండవనే బరితెగింపే కారణమని విపక్షాలు అంటున్నాయి. ఇప్పటికైనా కేసులు నమోదు చేసిన వారిపై త్వరితగతిన విచారణ పూర్తిచేసి చర్యలు చేపట్టాలని ప్రజలు అభిప్రాయ పడుతున్నారు.



నకిలీ దందా

- నడ్డివిరిచిన నకిలీ విత్తనాలు
- దుగ్గిరాల రైతులు పూర్తిగా మునిగిపోయారు...
- మిర్చి రైతుల నష్టం అపారం
- అక్కడ కేజీ రూ.6 వేలు కొని.. ఇక్కడ రూ.1.20 లక్షలకు అమ్మకం
- ఉద్యోగులకు కంపెనీల్లో వాటాలు
- గుంటూరు నుంచే అన్ని చోట్లకు సరఫరా

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 19: విత్తన ఎంపికలోనే రైతు మీద దెబ్బ పడుతోంది. ఏది అసలో ఏది నకిలీనో తెలుసుకోలేని సందిగ్ధావస్థ అన్నదాతను తిప్పలపాలు చేస్తోంది. ఖరీఫ్, రబీ అన్న తేడా లేకుండా రైతులు విత్తనాల విషయంలో మోసపోతూనే ఉన్నారు. విత్తనాల కంపెనీల మాటల ఆకర్షణలో పడి నిండా మునిగిపోతున్నారు. పంట చేతికి రావలసిన సమయానికి మోడుబారిన చెట్లను చూసి గుండె పగులుతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అన్ని ప్రాంతాలకు నగరంలో నుంచే విత్తనాలు సరఫరా అవుతున్నాయి. వాటిల్లో చాలాభాగం నకిలీవి కూడా ఉంటున్నాయి. ఉన్నతస్థాయి అధికార యంత్రాంగం ఇక్కడే ఉన్నప్పటికీ పర్యవేక్షణ కరువవ్వటంతో అన్నదాతల బతుకుల్లో బండలు పడుతున్నాయి. జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో పనిచేసే కొందరు ఉద్యోగులకు విత్తనాల కంపెనీల్లో వాటాలు ఉన్నాయన్న ఆరోపణలు ఉన్నాయి.

రైతు శ్రమ బూడిదలో పోసిన పన్నీరు..

దుగ్గిరాల మండలం మంచికలపూడిలో కొందరు రైతులు క్యాలీఫ్లవర్ సాగు చేశారు. అందుకోసం గుంటూరు నుంచి విత్తనాలను తీసుకువెళ్లారు. 75 రకం, వైట్ సుప్రీమ్ గోల్డ్ విత్తనాలను సాగు చేశారు. పైరు ఏపుగా పెరిగింది కానీ పువ్వు రాలేదు. పెరిగిన పైరు క్రమంగా ఎండిపోయింది. అది గమనించిన రైతులు స్థానిక వ్యవసాయ శాఖ అధికారుల వద్దకు పరుగులు తీశారు. తాము మోసపోయామని గ్రహించారు. ఈ పంట సాగుకు ఒక్కో రైతుకు సుమారు రూ.60 వేల వరకు వరకు ఖర్చయినట్లు తెలుస్తోంది. విత్తనాలు ప్యాకెట్లు కూడా ఒక్కొక్కటి రూ.6 వేలు చొప్పున కొనుగోలు చేశారు. పెదనందిపాడుకు చెందిన కిషోర్ ఈ ఏడాది మిర్చిపంట సాగు చేశాడు. అన్నవరం సమీపంలో పొలాన్ని కౌలుకు తీసుకొని సాగుకు ఉపక్రమించాడు. మొక్కలు ఏపుగా పెరిగినప్పటికీ కాపు రాకపోవడంతో పంటను ధ్వంసం చేసి శనగ వేసుకున్నాడు. శనగ విత్తనాలు రైతు భరోసా కేంద్రాల నుంచే తీసుకున్నప్పటికీ అవి కూడా సరిగా మొలవకపోవడంతో ఆ పంటను తీసేసి మొక్కజొన్న నాటుకున్నాడు. పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం తాళ్ళచెరువులో కొందరు రైతులు గుంటూరు నుంచి తీసుకువెళ్లారు. మిర్చి విత్తనాలను నారుగా పోశారు. అవి మొలకెత్తక పోవటంతో అధికారులకు ఫిర్యాదు చేశారు. రెంటచింతల మండలంలోని కొందరు రైతులు ఇదే అనుభవాన్ని ఎదుర్కొన్నారు. విత్తనాలను విక్రయిస్తున్న డీలర్లు రైతుల్లోని నిరక్షరాస్యతను అడ్డం పెట్టుకొని మోసం చేస్తున్నారు. అందమైన ప్యాకింగ్‌లను చూపించి విత్తనాలను రైతులకు అంట గడుతున్నారు. విత్తనాలు విక్రయించే సందర్భంలో తగినవిధంగా బిల్లులు ఇవ్వకపోవడంతో రైతులు పోరాడే అవకాశాన్ని కోల్పోతున్నారు.

మిర్చి విత్తనాలకు ఇదే సీజన్..



ఇతర రాష్ట్రాల నుంచి ఆంధ్రాకు వివిధ రకాల విత్తనాలు ఫిబ్రవరి, మార్చి నెలలోనే సరఫరా అవు తాయి. కర్ణాటక లోని రాణి బెంగళూరు ప్రాంతం నుంచి మిర్చి విత్తనాలను గుంటూరు వ్యాపారులు కొనుగోలు చేస్తారు. అక్కడ మిర్చి విత్తనాలు కేజీ రూ.6 వేలకు కొనుగోలు చేసి ఇక్కడ గ్రాముల చొప్పున ప్యాకింగ్ చేస్తారు. ప్యాకింగ్ చేసిన విత్తనాలను కేజీ రూ.లక్షా ఇరవై వేల వరకు అమ్మడం జరుగుతుంది. మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల నుంచి పత్తి విత్తనాలను కొనుగోలు చేసి తీసుకొస్తారు. వాటికి యాసిడ్, సున్నం కలిపి ఆరబెట్టిన తర్వాత ప్యాకింగ్ చేస్తారు. వాటిని కూడా అధిక ధరలకు విక్రయిస్తున్నారు. గుంటూరు నగరం లో సుమారు 20వరకు విత్తన కంపెనీలు ఉన్నాయి. విత్తన నాణ్యతను పెద్దగా పరిశీలించకుండానే డైరెక్ట్‌గా మార్కెట్లోకి విడుదల చేయటంతో రైతులు సాగులో నష్టపోతున్నారు.

తనిఖీలు లేవు...

రాష్ట్రాల నుంచి గుంటూరుకు మిర్చి పత్తి విత్తనాలు స్థానిక పార్సిల్ కేంద్రాల ద్వారా సరఫరా అవుతున్నాయి. సరైన రీతిలో తనిఖీలు జరపకపోవడంతో నకిలీ విత్తనాలు మార్కెట్లోకి వెళ్లిపోతున్నాయి. వ్యవసాయ శాఖలోని కొందరు ఉద్యోగులు విత్తన కంపెనీలో వాటాదారులుగా ఉండటంతో తనిఖీలు తూతూమంత్రంగా సాగుతాయన్న అపప్రద ఉంది.

ఇంటర్ పరీక్షలకు.. 19,853 మంది

- పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి
- కలెక్టర్ పి.రంజిత్‌బాషా



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల, ఫిబ్రవరి 19: ఇంటర్మీడియట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై ఇంటర్మీడియట్ బోర్డు జిల్లా స్థాయి కమిటీ సమావేశం సోమవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జరిగింది. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ మార్చి1వ తేదీ నుంచి 20వ తేది వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు కొనసాగుతాయన్నారు. జిల్లాలో 35 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలకు 9,090 మంది ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 10,763 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. మొత్తం జిల్లా నుంచి 19,853 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని చెప్పారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలకు 400మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 450 మంది ఉపాధ్యాయులను ఇన్విజిలేటర్లుగా నియమించామని తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌టీమ్‌లను రెండు, కస్టోడియన్స్, సిట్టింగ్ స్క్వాడ్‌టీమ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. ఉదయం 9గంటలు నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ఆ సమయంలో పరీక్షా కేంద్రాల వద్ద 144వ సెక్షన్ అమలు చేయాలని, జిరాక్స్ సెంటర్లు మూతవేయించాలని చెప్పారు. కేంద్రాల వద్ద విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. ప్రాథమిక వైద్యకిట్‌లు సిద్ధం చేసుకోవాలన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ పి.మహేష్, ఇంటర్మీడియట్ ఆర్ఐవో పి.యర్రయ్య, జిల్లా విద్యాశాఖాధికారి కె.నారాయణరావు, డీపీవో రవికుమార్, డీఎమ్అండ్‌హెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, ఆర్టీసీ ఆర్ఎం వి.కృష్ణారెడ్డి, ఏవో కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.



బాబోయ్ దొంగలు

- తాళం వేసి ఉన్న ఇళ్లే టార్గెట్‌గా చోరీలు
- రాత్రి సమయాల్లో తగ్గిన పోలీసుల గస్తీ
- అటకెక్కిన ఎల్‌హెచ్‌ఎంఎస్

అద్దంకి, ఫిబ్రవరి 19: తాళం వేసి ఉన్న ఇళ్లే టార్గెట్‌గా చోరీలు జరుగుతున్నాయి. ఇటీవల కాలంలో అద్దంకి పట్టణంతో పాటు మండలంలో జరిగిన చోరీలను పరిశీలిస్తే అన్నీ తాళాలు వేసి ఉన్న ఇళ్లలోనే జరిగాయి. గత రెండు, మూడు నెలల వ్యవధిలోనే సుమారు పది ఇళ్లలో చోరీలు చోటుచేసుకున్నాయి. మూడు నెలల క్రితం అద్దంకి పట్టణంలోని సాయినగర్ (కమలేశ్వరస్వామి మాన్యం)లో రెండు ఇళ్లలో, నెల రోజుల క్రితం విశ్వభారతి స్కూల్ రోడ్డులోని టవర్ సమీపంలో ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఆది వారం రాత్రి అద్దంకి పట్టణంలోని న్యూ ఎస్‌బీఐ కాలనీలో భారీ చోరీ జరిగింది. మండలంలోని శ్రీనివాసనగర్‌లో నెల రోజుల క్రితం రెండు ఇళ్లలో చోరీలు జరిగాయి. పది రోజుల క్రితం గోపాలపురంలో పట్టపగలే చోరీ చోటుచేసుకుంది. ఇలా పగలు, రాత్రి తేడా లేకుండా తాళం వేసి ఉన్న ఇళ్లే టార్గెట్‌గా చోరీలు జరిగాయి. నేరుగా తాళాలు పగులగొట్టి ఇళ్లలోకి ప్రవేశించి బీరువాలు తెరిచి చోరీలకు పాల్పడుతున్నారు. వీటిలో అత్యధిక శాతం చోరీలు జరిగిన ప్రదేశాలను పరిశీలిస్తే శివారు గృహాలు కావటంతో పాటు నామ్ రోడ్డుకు సమీప ప్రాంతాలు కావటం విశేషం. దీనిని బట్టీ చోరీలకు పాల్పడిన తరువాత సులువుగా తప్పించుకొని వెళ్లేందుకు వీలుగా ముందుగా రెక్కీలు నిర్వహించి చోరీలకు పాల్పడుతున్నట్లు తేటతెల్లమవుతోంది.



అద్దంకిలోని న్యూ ఎస్‌బీఐ కాలనీలో చోరీ జరిగిన ఇంట్లో చిందరవందరగా పడవేసిన దుస్తులు, వస్తువులు

అటకెక్కిన ఎల్‌హెచ్‌ఎంఎస్...

తాళాలు వేసి ఉన్న ఇళ్లలో చోరీలు జరగకుండా పోలీసుల పర్యవేక్షణ ఉండేవిధంగా లాక్ట్ హౌస్ మానిటరింగ్ సిస్టం(ఎల్‌హెచ్‌ఎంఎస్) ఏర్పాటుచేశారు. ఇతర ప్రాంతాలకు వెళ్లే కుటుంబాలు పోలీసులకు ముందస్తుగా సమాచారం అందిస్తే ఆ ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి వాటిని పోలీస్ స్టేషన్‌కు అనుసంధానం చేసి పర్యవేక్షణ జరిగేది. గతంలో ఈ పద్ధతి ద్వారా కొంతమేర సత్ఫలితాలు వచ్చాయి. ఇప్పుడు పూర్తిగా అటకెక్కింది. రాత్రి సమయాల్లో పోలీసుల గస్తీ కూడా అంతంతమాత్రంగానే ఉంటుందన్న విమర్శలు వస్తున్నాయి. అదే సమయంలో నామ్ హైవేపై గతంలో గస్తీకి అద్దంకి నియోజకవర్గ పరిధిలో రెండు పోలీస్ మొబైల్ వాహనాలు ఉండేవి. ప్రస్తుతం ఒకదానినే పరిమితం చేయటంతో పాటు పర్యవేక్షణ కూడా అంతంతమాత్రంగానే మారిందన్న విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఇతర ప్రాంతాల నుంచి వచ్చి చోరీలకు పాల్పడి తప్పించుకునేందుకు వీలుగా మారటంతో చోరీలు అధికమయ్యాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా పోలీస్ అధికారులు స్పందించి చోరీలు జరగకుండా మరింత నిఘా పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

ఎమ్మెల్యే కోన రఘుపతి అవినీతి, అక్రమాలపై

పోరాటం చేస్తా

- మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ నాయకులు అన్నం సతీష్ ప్రభాకర్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న అన్నం సతీష్ ప్రభాకర్

బాపట్ల, ఫిబ్రవరి 19: ఎమ్మెల్యే కోన రఘుపతి చేసిన అవినీతి, అక్రమాలపై పోరాటం కొనసాగిస్తానని మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ నాయకులు అన్నం సతీష్ ప్రభాకర్ స్పష్టం చేశారు. బాపట్లలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ డబ్బు మదంతో ఎమ్మెల్యే కోన ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. 40 సంవత్సరాలకు పూర్వమే క్విడ్‌ప్రోకో పరిచయం చేసిన ఘనత కోన ప్రభాకరరావుకే దక్కిందన్నారు. అలాంటి వ్యక్తి విగ్రహాన్ని పెట్టటానికి రామాలయాన్నే తొలిగించాలనే ఆలోచన చేయటం సిగ్గుచేటు అన్నారు. బాపట్లలో మున్సిపల్ ఎన్నికలు జరగకుండా చేసి మున్సిపాలిటీని అడ్డుపెట్టుకొని ఇష్టానుసారంగా దోపిడి చేశావని విమర్శించారు. విలీనం అనే కుట్రతో పంచాయతీలకు ఎన్నికలు లేకుండా చేసి అక్కడ కూడా అక్రమాలకు తెరతీశావన్నారు. విద్యాకేంద్రంగా ఉన్న బాపట్లను వైసీపీ నాయకులు గంజాయిహబ్‌గా మార్చారని ఆరోపించారు. మురుగు కాల్వలలో తీసిన సిల్ట్‌ను కూడా ట్రక్కు రూ.3వేలకు కూడా విక్రయించిన ఘనత ఎమ్మెల్యే కోనకే దక్కుతుందన్నారు. ఆలయాల అభివృద్ధి పేరిట విరాళాలు సేకరణ పేరుతో వసూళ్ళు చేస్తున్నారన్నారు. రోడ్డు విస్తరణ సమయంలో వ్యాపారుల వద్ద పెద్దఎత్తున వసూళ్ళు చేశారన్నారు. ఎస్సీ, ఎస్టీల అసైన్డ్ భూములు కొనుగోలు చేయించి బినామీల పేరుతో 70నుంచి 80అడుగుల లోతు ఇసుక తవ్వి విక్రయించి కోట్ల రూపాయలు గడించారని ఆరోపించారు. రాబోయే రోజుల్లో కోన బాధిత సంఘం పెట్టి వసూళ్ళు చేసిన డబ్బుమొత్తం తిరిగి వసూళ్ళు చేస్తామన్నారు. దీనికి అధ్యక్షునిగా తాను ఉంటానని లీగల్‌టీమ్ ద్వారా బాధితులకు అండగా నిలుస్తానన్నారు. ఐదేళ్ల టీడీపీ పాలనలో తాను చేసిన అభివృద్ధి ఐదేళ్ళ వైసీపీ పాలనలో ఎమ్మెల్యే కోన చేసిన అభివృద్ధిపై చర్చకు రావాలని సవాల్ విసిరారు. కప్పం కట్టే పరిస్థితి నుంచి బాపట్ల ప్రజలను రక్షిస్తానన్నారు. బీజేపీ బలపరిచిన అభ్యర్థితో కలిసి నిన్ను ఓడించటానికి కృషి చేస్తానన్నారు.

రానున్నది టీడీపీ ప్రభుత్వమే

- ప్రతి నేత, కార్యకర్తకు సముచిత స్థానం
- రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్
- టీడీపీలోకి చేరికలు

రేపల్లె, ఫిబ్రవరి 19: రాష్ట్రంలో టీడీపీ-జనసేన ప్రభుత్వం అధికారంలోకి రానున్నదని, వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల కారణంగానే ఆపార్టీ నుండి టీడీపీలోకి భారీగా చేరికలు జరుగుతున్నాయని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అన్నారు. సోమవారం రూరల్ మండలం టీడీపీ అధ్యక్షుడు రేపల్లె రామాంజనేయులు, వడ్డిలక్ష్మీజీ ఆధ్వర్యంలో పిరాట్లంక గ్రామ మాజీ సర్పంచ్ మండలి రామ్మోహన్‌రావు, మండలి తారక బ్రహ్మేశ్వరరావు, దండా వెంకటేశ్వరరావు, మోపిదేవి బసవారావు, కైతేపల్లి పంచాయతీ నుండి సయ్యద్ జిలాని, రహంతుల్లాఖాన్, సయ్యద్ కరిముల్లా, షేక్ కరిముల్లా,సుబాని, సర్దార్ గౌస్, మరో 40 కుటుంబాల వారు టీడీపీలో చేరగా, వారికి ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అదే విధంగా మండలంలోని బొందలగరువు వైసీపీ సర్పంచ్ వర్రే మహేంద్ర, నిజాంపట్నం మండలం ప్రజ్ఞం గ్రామంలోని వైసీపీకి చెందిన 30 కుటుంబాల వారు టీడీపీలో చేరగా వారినీ పార్టీలోకి ఆహ్వానించామని అనగాని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి పంతాని మురళీధరరావు, కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు, జీవీ నాగేశ్వరరావు, తాతా ఏడుకొండలు, స్థానిక టీడీపీ నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



వైసీపీ నేతలకు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అనగాని



వల్లాపల్లిలో అసంపూర్తిగా ఉన్న గ్రామ సచివాలయ భవనం

వైసీపీలో వర్గపోరు

- పనులు పూర్తి చేయకుండానే సచివాలయం ప్రారంభం
- బిల్లు ఇవ్వకుండా ప్రారంభం చేశారని కాంట్రాక్టర్ ఆవేదన
- ఎస్సీలను చిన్నచూపు చూస్తున్నారని ఆరోపణ

బల్లికురవ, ఫిబ్రవరి 19: మండలంలోని వల్లాపల్లి వైసీపీలో వర్గపోరు బహిర్గతమైంది. గ్రామంలో వైసీపీకి చెందిన నాయకుడు మందా వీరాంజనేయులు గ్రామ సచివాలయ భవన పనులు చేస్తున్నారు. ఇంకా కొంత పనులు చేయాల్సి ఉంది. ఇందుకుగాను ఫైనల్ బిల్లు రూ.5.70 లక్షలు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. ఇవేమి పట్టించుకోకుండా వల్లాపల్లి గ్రామంలోని వైసీపీలోని రెండో వర్గం నేతలు నిర్మాణంలో ఉన్న సచివాలయ భవనానికి వేసి ఉన్న తాళాన్ని అధికారుల ద్వారా పగలగొట్టించారు. వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనిమిరెడ్డితో సోమవారం రాత్రి ప్రారంభించే చర్యలు చేపట్టారు. దీంతో పనులు చేపట్టిన కాంట్రాక్టర్ తనకు తెలియకుండా తనకు చెల్లించాల్సిన బిల్లులు రాకుండా ఎలా ప్రారంభిస్తారని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అయినప్పటికీ అధికారులు పట్టించుకోకుండా తనకు బిల్లులు ఇవ్వకుండా తన పేరు శిలాఫలకంపై వేయకుండా భవనం కిందిభాగంలో శిలాఫలకం వేసి ప్రారంభించారని కాంట్రాక్టర్ వాపోయాడు. తాను వైసీపీలో ఉన్నా ఇలా చేశారని, ఇదేమి న్యాయమని అన్నారు. ఎస్సీని అని చిన్నచూపు చూశారని, తాను కోర్టుకు వెళతానని తెలిపారు. పనులు పూర్తి చేయకుండా పంచాయతీ కార్యదర్శికి భవనం ఎలా అప్పగిస్తారని ఆయన ప్రశ్నించారు. వల్లాపల్లిలో వైసీపీలో ఉన్న రెండు వర్గాల మధ్య సచివాలయ భవన ప్రారంభం వద్ద గొడవలు జరిగే అవకాశం ఉందని గమనించిన ఎస్ఐ శివనాగిరెడ్డి సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటుచేశారు.



మందడం రైతు ధర్నా శిబిరంలో బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేస్తున్న రైతులు

విధ్వంసం తప్పితే అభివృద్ధి శూన్యం

● 1525వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు

తుళ్లూరు, ఫిబ్రవరి 19: ప్రజావేదిక కూల్చివేతతో సీఎం జగన్‌రెడ్డి పాలన ప్రారంభమైందని రాజధాని అమరావతికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు సోమవారం నాటికి 1525వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి వారు మాట్లాడుతూ, కూల్చటం, పడగొట్టడం జగన్‌రెడ్డి విధానమన్నారు. ఎంతో శక్తివంతమైన అమరావతిని నాశనం చేయటం ఎవరి తరం కాదన్నారు. ఎప్పటికైనా ఐదుకోట్ల మంది ఆంధ్రుల రాజధాని అమరావతేనని స్పష్టం చేశారు. రాష్ట్రంలో అభివృద్ధి గుండు సున్నా అని పేర్కొన్నారు. విధ్వంసకర పరిపాలన చేస్తున్న జగన్‌రెడ్డి ఇంటికి పంపటమే లక్ష్యంగా ప్రజలు ఉన్నారన్నారు. దోచుకోవటం ఒక్కటే వైసీపీ పాలకులకు తెలుసునని అన్నారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం చెప్పిన తీర్పు ప్రకారం అమరావతి అభివృద్ధిని కొనసాగించాలన్నారు. మూడు ముక్కల ఆటతో రాష్ట్రాన్ని నాశనం చేయవద్దన్నారు. దోచుకోవటం ఆపి ప్రజాసేవ చేయాలని హితవు పలికారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేశారు. రాజధాని 29గ్రామాలతో పాటు మంగళగిరి, తాడికొండ నియోజకవర్గాల్లో మూడు రాజధానులకు వ్యతిరేకంగా రైతులు ఆందోళనలు నిర్వహించారు.

మాచర్లలో ప్రత్యేక రాజ్యాంగం నడుస్తోంది

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బ్రహ్మారెడ్డి



షాపింగ్ కాంప్లెక్స్‌లు, డూప్లెక్స్ హౌస్‌ల నిర్మాణాలను చూపుతున్న బ్రహ్మారెడ్డి

మాచర్ల, ఫిబ్రవరి 19: మాచర్లలో అంబేద్కర్ రాజ్యాంగం నడవడం లేదని, ప్రత్యేక రాజ్యాంగం నడుస్తోందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బ్రహ్మారెడ్డి అన్నారు. పట్టణంలోని పీడబ్ల్యూడీ కాలనీలో ఎమ్మెల్యే పీఆర్కే పంపిణీ చేసిన నివేశన స్థలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ పీడబ్ల్యూడీ కాలనీలో దశాబ్దాల కాలంగా నివాసముంటున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను కాదని, తన అనుచరులకు కాలనీలో సుమారు నాలుగు సెంట్ల చొప్పున పిన్నెల్లి సోదరులు దోచి పెట్టారన్నారు. నిబంధనలను కాదని ఇక్కడ షాపింగ్ కాంప్లెక్స్‌లు, డూప్లెక్స్ హౌస్‌లు నిర్మిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరందరూ నిరుపేదలా.. పెత్తందారులా అని ప్రశ్నించారు. నిత్యం నా ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనార్టీలు అంటూ ఊదరగొట్టే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దీనికేం సమాధానం చెబుతారన్నారు. టీడీపీ, జనసేన కూటమి అధికారంలోకి రాగానే పీడబ్ల్యూడీ కాలనీలో పంపిణీ చేసిన స్థలాలపై, నిర్మాణాలపై సమగ్ర విచారణ జరిపించి దశాబ్దాల కాలంగా కాలనీలో నివాసముంటున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు న్యాయం చేసే బాధ్యతను తీసుకుంటామన్నారు. చోద్యం చూస్తున్న అధికారులు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. బ్రహ్మారెడ్డి వెంట యెనుముల కేశవరెడ్డి, పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, లెనిన్‌బాబు, మోసిన్, మున్నా రాంబాబు, సాతులూరి కుమార్, బొల్లెద్దుల ప్రకాష్, బాబు, నూకరాజు, శ్రీనివాసరవు, కొమెర శివ తదితరులు ఉన్నారు.

స్వర్ణ యుగమో.. రాతియుగమో తేలుద్దామా?

● కన్నా లక్ష్మీనారాయణ



కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, ఫిబ్రవరి 19: ఫ్యాన్ రెక్కలు విరిచేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అభివృద్ధిపై దమ్ముంటే వైసీపీ నాయకులు బహిరంగ చర్చకు సిద్ధం కావాలన్నారు. ఎవరి పాలన స్వర్ణయుగమో, ఎవరి పాలన రాతి యుగమో తేల్చుద్దామన్నారు. రాష్ట్ర అభివృద్ధిపై చర్చించేందుకు వైసీపీ నాయకులకు దమ్ముందా? అని ఆయన ప్రశ్నించారు. జగన్ సిద్ధం అని సభలు పెట్టి అశుద్ధం మాటలు మాట్లాడుతున్నాడన్నారు. జగన్ ఓటమి భయంతో బదిలీలు అంటూ 77 మందిని మడత పెట్టాడన్నారు. మిగిలిన వారిని 50 రోజుల్లో జనం మడత పెడతారన్నారు. రాష్ట్రంలో ఏ ఊరు వెళ్ళినా వైసీపీ పాలనలో విధ్వంసం కన్పిస్తుందన్నారు. వందల కోట్లు ఖర్చు చేస్తూ అధికార దుర్వినియోగంతో సిద్ధమని సభలు పెడుతున్నాడన్నారు. జగన్ నోటి నుంచి వచ్చేవి అన్ని అసత్యాలు, తప్పుడు ప్రచారాలని తెలిపారు. వార్తలు కవర్ చేసేందుకు వెళ్ళిన మీడియా సిబ్బందిపై దాడి చేయటం దుర్మార్గం అన్నారు. వచ్చే ఎన్నికలు నిజమైన పెత్తందారు జగన్‌కు, ఐదుకోట్ల మంది ప్రజలకు మధ్య యుద్ధమని కన్నా పేర్కొన్నారు.

భర్తను చంపిన భార్య, ప్రియుడుకి జీవిత ఖైదు

గుంటూరు(లీగల్), ఫిబ్రవరి19: మంగళగిరి మండలం, కృష్ణాయపాలెం గ్రామానికి చెందిన బుల్లా రవి హత్యకేసులో అతని భార్య, ఆమె ప్రియుడికి జీవిత ఖైదు, జరిమానా విధిస్తూ సోమవారం మూడవ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి జి.అర్చన తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. రవికి ఉద్దండరాయునిపాలేనికి చెందిన రాణితో వివాహం అయింది. పొలం పనులు చేసుకునే రవికి పుట్టుకతోనే మూగ, చెవుడు వైకల్యం ఉంది. పెళ్లి తర్వాత పెనుమాక గ్రామానికి చెందిన కిరణ్‌తో రాణికి వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ విషయంలో భార్యా, భర్తల మధ్య ఘర్షణ చోటుచేసుకోవటంతో రాణి నూతక్కిలో ఉన్న ఆమె అత్త ఇంటికి వెళ్లిపోయింది. కొద్దిరోజులకు తిరిగి వచ్చింది. అయినప్పటికీ కిరణ్‌తో తన వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తూనే ఉంది. ఎప్పటికైనా భర్త ఉండటం వారి సంబంధానికి ఇబ్బంది అని భావించి, రవిని తుదముట్టించాలనుకున్నారు. 2017 ఆగస్టు 14వ తేదీ ఉదయం రవి తన తండ్రి, భార్య రాణితో కలిసి బెండతోటకు కాయలు కోయటానికి వెళ్లారు. ఆ సమయంలో కిరణ్ వచ్చి రవిని గొంతు పట్టుకొని కింద పడేశాడు. పక్కనే ఉన్న రవి భార్య కొండరాయి తీసుకొని తలపై మోదింది. దీంతో రవి అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. పోలీసుల దర్యాప్తులో నిజాలు తేలటంతో భార్యపై, ప్రియుడిపై కేసు నమోదు చేసి, సీఐ ఎం.మధుసూదనరావు కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కేసు రుజువు కావటంతో నిందితులకు జీవిత ఖైదు, రూ.వెయ్యి జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ తరపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాసం సూరిబాబు వాదించారు.

ప్రణాళికాబద్ధంగా ఎన్నికల నిర్వహణ

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు



జాతీయ ఎన్నికల నిర్వహణ మాస్టర్ ట్రైనర్‌లతో కలెక్టర్ ఢిల్లీరావు

విజయవాడ, ఫిబ్రవరి 19: రానున్న ఎన్నికలు విజయవంతం కావడానికి ప్రణాళికా బద్ధంగా వ్యవహరించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లకు సూచించారు. విజయవాడ మేరీస్టెల్లా కాలేజీలో సోమవారం తూర్పు గోదావరి, గుంటూరు, బాపట్ల, పల్నాడు, కృష్ణా, ఏలూరు, ఎన్టీఆర్, ప్రకాశం జిల్లాల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు ఐదు రోజుల శిక్షణా కార్యక్రమం ప్రారంభమైంది. జాతీయ స్థాయి మాస్టర్ ట్రెయినర్లు కుముద్‌కుమార్ ఝా, జీ.ఆర్ హరిశిల్పులు, ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్, డిప్యూటీ సీఈవో ఎస్.మల్లిబాబు, ఆర్డీవో బీ.హెచ్ భవానీశంకర్ తదితరులు పాల్గొన్న ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో ఆర్వో, పీవోల పాత్ర చాలా ముఖ్యమైనదని చెప్పారు. మాస్టర్ ట్రెయినర్‌లు ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ప్రణాళికాబద్ధంగా ఎన్నికల ప్రక్రియను నిర్వహించి విజయవంతం చేయాలని సూచించారు. ఈ నెల 12 నుంచి 16వ తేదీ వరకు 118 మందికి శిక్షణ ఇచ్చారని, ప్రస్తుతం ఈ ఐదు రోజుల శిక్షణా కార్యక్రమంలో 124 మంది ఏఆర్‌వోలకు శిక్షణా ఇస్తున్నామని తెలిపారు. ఎన్నికలలో అనుసరించాల్సిన విధివిధానాలపై ఆయన పలు సూచనలు చేశారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ మాట్లాడుతూ నిబద్ధత అవగాహన ముఖ్యమని చెప్పారు. సంబంధిత అంశాలపై ఆయన పలు సూచనలు చేశారు. డిప్యూటీ సీఈవో ఎస్.మల్లిబాబు మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో సమన్వయం ముఖ్యమని, ఒత్తిడిని దూరం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రెయినర్లను కలెక్టర్ సత్కరించారు.

దుబాయ్ ట్రేడ్ సెంటర్‌లో
డబుల్ హార్స్ ఉత్పత్తుల స్టాల్



దుబాయ్‌లో డబుల్ హార్స్ ఉత్పత్తులను ప్రదర్శిస్తున్న సంస్థ ప్రతినిధులు

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 19: గల్ఫ్ దేశాలలో ఒకటైన దుబాయ్ ట్రేడ్ సెంటర్‌లో తెనాలి డబుల్ హార్స్ సంస్థ తమ ఉత్పత్తుల స్టాల్‌ను ఏర్పాటు చేసిన అరుదైన అవకాశం దక్కించుకుంది. ట్రేడ్ సెంటర్‌లో 22వ గల్ఫ్ ఫుడ్ ఫెస్టివల్‌ను ఈ నెల 19 నుంచి 23 వరకు నిర్వహిస్తున్నారు. 127 దేశాల ఆహార సంస్థల తయారీదారులు వీక్షించేందుకు వచ్చారు. ఈ ఫుడ్ ఫెస్టివల్‌లో తమ ఉత్పత్తులను ప్రదర్శించామని డబుల్ హార్స్ ఎండీ మునగాల శ్యాంప్రసాద్ తెలిపారు. ఇటీవల కాలంలో ప్రపంచ ప్రమాణాలను అనుసరించి డబుల్ హార్స్ సంస్థ పలు ఉత్పత్తులు చేపట్టింది. ప్రపంచ మార్కెట్ అవసరాలను భవిష్యత్ వ్యూహాలను అవలంబించేందుకు ఈ ఫెస్టివల్ తమకు దోహదపడిందన్నారు. పలు దేశాల ఉత్పత్తులు, ప్రపంచ ప్రజలకు చేరువ అవుతున్నాయని, తమకు ఈ అవకాశం దక్కడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు.

రేపు వరంగల్‌కి ప్రత్యేక రైలు

గుంటూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా బుధవారం(ఈ నెల 21వ తేదీన) గుంటూరు నుంచి వరంగల్‌కి ప్రత్యేక రైలుని నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో సీహెచ్ రాకేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెంబరు.07016 గుంటూరు - వరంగల్ ప్రత్యేక రైలు బుధవారం ఉదయం 6.40కి బయలుదేరి విజయవాడ, మధిర, మోటుమర్రి, బోనకల్లు, చింతకాని, ఖమ్మం, పాపటపల్లి, డోర్నకల్, మహబూబాబాద్, కేసముద్రం, నెక్కొండ, చింతపల్లి మీదగా మధ్యాహ్నం 12.30కి వరంగల్ చేరుకొంటుంది. ఈ రైలు అన్ని జనరల్ సెకండ్ క్లాస్ బోగీలతోనే ప్రయాణిస్తుందని సీపీఆర్‌వో తెలిపారు.

24, 25 తేదీల్లో
నాలుగు జిల్లాల స్థాయి టెన్నిస్ పోటీలు

చిలకలూరిపేట, ఫిబ్రవరి 19: పట్టణంలోని సీఆర్ క్లబ్‌లో ఈనెల 24, 25 తేదీల్లో నాలుగు జిల్లాల స్థాయిలో ఆహ్వాన టెన్నీస్ పోటీలను నిర్వహిస్తున్నట్లు క్లబ్ కార్యదర్శి పావులూరి శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల స్థాయిలో ఈ పోటీలు ఉంటాయని తెలిపారు. మొత్తం 70కి పైగా జట్లు ఈ పోటీల్లో పాల్గొంటాయని ఆయన తెలిపారు.

గంజాయి కేసులో ఐదుగురి అరెస్టు

చేబ్రోలు, ఫిబ్రవరి 19: వ్యసనాలకు బానిసలై గంజాయి కొనుగోలు చేసి వినియోగించటంతోపాటు, విక్రయిస్తున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు తెనాలి డీఎస్పీ రమేష్ తెలిపారు. చేబ్రోలు పోలీస్‌స్టేషన్‌లో సోమవారం జరిగిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ పొన్నూరు పట్టణానికి చెందిన షేక్ ఫజల్, కట్టెంపూడి గ్రామానికి చెందిన నున్నా యశ్వంత్, పట్టణానికి చెందిన ఓ మైనర్ బాలుడు గంజాయికి అలవాటు పడ్డారు. యడ్లపాడు మండలం, బోయపాలెం గ్రామంలో ఆంజనేయస్వామి బొమ్మ వద్ద బడ్డీకొట్టు నడుపుతున్న ఒరిస్సాకు చెందిన సరటోల రమాకంత్, ఆషీష్ కుమార్ పాండా వద్ద గంజాయి కొనుగోలు చేస్తున్నారు. అలాగే ఇటీవల సత్తెనపల్లికి చెందిన వ్యక్తి కూడా గంజాయి తాగుతూ వీరికి పరిచయం అయ్యాడు. ఈ నెల 18వ తేదీన షేక్ ఫజల్, యశ్వంత్, మరో వ్యక్తి బోయపాలెం వెళ్లి అక్కడ ఒరిస్సాకు చెందిన రమాకాంత్, ఆశీస్‌కుమార్ పాండాల వద్ద రూ.30 వేల విలువైన గంజాయిని కొనుగోలు చేసారు. ఈ గంజాయిని ఫజల్, యశ్వంత్ మరో మైనర్ బాలుడు కలిసి ఇంజనీరింగ్ కళాశాల వద్ద విద్యార్థులకు విక్రయించాలని పొన్నూరు నుంచి చేబ్రోలు వస్తుండగా మార్గ మధ్యలో సీఐ కోటేశ్వరరావు, ఎస్‌ఐ మహేష్‌లు తమ సిబ్బంది కొమ్మమూరు కెనాల్ వద్ద వీరిని అదుపులోకి తీసుకొన్ని విచారించిన్నట్లు చెప్పారు. నిందితుల వద్ద కిలో గంజాయి ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ కేసులో ఫజల్, యశ్వంత్, ఒరిస్సాకు చెందిన రమాకాంత్, అశీస్ కుమార్ పాండ, మైనర్ బాలుడిని అరెస్టు చేసినట్లు చెప్పారు. ఈ కేసును చేధించిన సిబ్బందిని డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.



అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ రమేష్ తదితరులు

లిబరల్ ఆర్ట్స్ స్కూల్ ప్రారంభం



ఈశ్వరీ లిబరల్ ఆర్ట్స్ స్కూల్ ప్రారంభ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ సత్యనారాయణన్, నికోలస్, ప్రశాంత్ మహాపాత్ర, వీసి మనోజ్‌కుమార్ తదితరులు

మంగళగిరి, ఫిబ్రవరి 19: ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ప్రాంగణంలో బీఏ, బీఎస్సీ చదివే విద్యార్థుల కోసం కొత్తగా ఈశ్వరీ లిబరల్ ఆర్ట్స్ స్కూల్‌ను ప్రారంభిస్తున్నట్టు ఆ వర్సిటీ అధ్యక్షులు డాక్టర్ సత్యనారాయణన్ చెప్పారు. తన తల్లిగారైన ఈశ్వరీదేవి పేరిట ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలో నూతనంగా ఏర్పాటుచేసిన లిబరల్ ఆర్ట్స్ స్కూల్‌ను సోమవారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య మనోజ్‌కుమార్ అధ్యక్షతన ఏర్పాటైన సభలో మాట్లాడుతూ లిబరల్ ఆర్ట్స్ స్కూల్ ప్రత్యేకతలను గురించి వివరించారు. తమ ఈ స్కూల్‌లో కొత్తగా బీఎస్సీ, బీఏ విభాగాలలో వివిధ రకాల కోర్సులను ప్రవేశపెట్టామన్నారు. సైకాలజీ, ఎకనామిక్స్, ఇంగ్లీష్, హిస్టరీ వంటి సబ్జెక్టులలో పీహెచ్‌ఏ ప్రోగ్రామ్‌లను కూడ ప్రారంభిస్తున్నామని తెలిపారు. వర్సిటీ వైస్ ఛాన్సలర్ మనోజ్ ఆరోరా మాట్లాడుతూ తమ ఈ లిబరల్ ఆర్ట్స్ స్కూల్‌ను దేశంలోనే నెంబర్‌వన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ పాలకమండలి సభ్యులు డాక్టర్ నికోలస్, డాక్టర్ జానకి బాక్లే, ప్రశాంత్ మహాపాత్రో, డాక్టర్ గోపాల్‌గురు, డాక్టర్ చందన్‌గౌడ, డాక్టర్ ప్రదీప్ ఖోస్లా, వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ప్రేమ్‌కుమార్, డీన్ విష్ణుపద్ తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు మిర్చియార్డులో ధరలు ఇలా...

గుంటూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 1,48,759 టిక్కీల మిర్చి విక్రయానికి రాగా అందులో 1,33,190 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ జాయింట్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డులో 95,912 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			సూపర్ 10	--	--
334	9500	19500	నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
నెంబరు. 5	14500	17500	తేజ	8000	21000
273	12500	18500	బ్యాడిగి	11000	20000
341	9000	21500	దేవనూరుడీలక్స్	11000	20200
4884	--	--	తెల్లకాయలు	5000	13000

ఫ్యాన్ రెక్కలు విరిచేందుకు ప్రజలు సిద్ధం

● మాజీ ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 19: వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ రెక్కలు విరిసేంత కసితో రాష్ట్ర ప్రజలు సంసిద్ధంగా ఉన్నారని గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎవరి పాలనలో అభివృద్ధి.. ఎవరి పాలనలో విధ్వంసమో.. ప్రజలకు తెలుసని, దమ్ముంటే వైసీపీ నాయకులు బహిరంగ చర్చకు సిద్ధమేనా అని ప్రశ్నించారు. సీఎం జగన్ సిద్ధం అంటూ సభలు పెట్టి అశుద్ధపు మాటలు చెబుతున్నాడని అన్నారు. వచ్చే ఎన్నికలు జగన్ చివరి ఎన్నికలు అని, జగన్ టీంను మడత పెట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. పది రూపాయలు ఇచ్చి రూ.100 లాగేస్తున్న జగన్‌ను రాష్ట్ర ప్రజలు ఏకోసానా నమ్మే స్థితిలో లేర అన్నారు. దేశంలో అత్యంత ధనిక ముఖ్యమంత్రిగా మారిన జగన్‌రెడ్డికి పేదల జీవితాల గురించి మాట్లాడే అర్హత లేదని తెలిపారు. రాయలసీమలో 52 నియోజకవర్గాల్లో ప్రయాణీకులను ఇబ్బంది పెట్టి పాఠశాలలకు సెలవులు ప్రకటించి ఆర్‌టీసీ బస్సులు, పాఠశాలల బస్సులను లాగేసి జనాన్ని రాప్తాడు సభకు తరలించాడన్నారు. పాత్రికేయుడిపై దాడి హేయం అన్నారు. జగన్మోహన్‌రెడ్డి పేరు చెబితే బాబాయిపై గొడ్డలి వేటు, కోడికత్తి, ప్రభుత్వ టెర్రరిజం, ల్యాండ్, శ్యాండ్, మైన్, మైనింగ్ మాఫియా, క్విడ్ ప్రోకో, అధిక ధరలు, పనులు, చార్జీల పెంపు, అప్పుల బాదుడు, దొంగ ఓట్లు, హింసా రాజకీయాలు గుర్తుకు వస్తాయని అన్నారు. రివర్స్ టెండరింగ్‌తో ప్రాజెక్టులన్నీ మూలన పడేసిన జగన్ ఈసారి ఎన్నికలలో ఓటమి తప్పదని యరపతినేని శ్రీనివాసరావు పేర్కొన్నారు.

విదేశాలకు పారిపోయేందుకు జగన్ సిద్ధం

● మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



సమావేశంలో మాట్లాడుతున్న జీవీ ఆంజనేయులు

వినుకొండ, ఫిబ్రవరి 19: జగన్ పేరు చెబితే రాష్ట్ర ప్రజలకు అవినీతితో పాటు బాబాయి హత్య గుర్తుకొస్తుందని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి అవినీతి సొమ్ముతో విదేశాలకు పారిపోవడానికి సిద్ధం చేసుకుంటున్నారని అన్నారు. దమ్ముంటే అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని, లక్షల కోట్లు దోచుకున్న నీవు చర్చకు ఎందుకు రావని అన్నారు. నీవు చేసిన ద్రోహానికి షర్మిల మోసపోయి నీపై పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. నీ బాబాయి కూతురు నీపై పోరాటం చేసేందుకు సిద్ధమని అన్నారు. త్వరలో మీ కుర్చీ మడత పెట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అనంతపురం జిల్లా రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ అరాచక వ్యక్తులు దాడి చేయడాన్ని ఈ సందర్భంగా ఆయన తీవ్రంగా ఖండించారు. జగన్ ఒక మీడియాకు అధినేత అయి ఉండి కూడా దాడులను ప్రోత్సహించడం ఎంతవరకు సమంజసమన్నారు. కార్యక్రమంలో దాసయ్య, మురళీకృష్ణయాదవ్, ఆయూబ్ ఖాన్, గోవిందరాజులు, పెమ్మసాని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయులపై దాడులు హేయం


● ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్



పొన్నూరుటౌన్, ఫిబ్రవరి19: వైసీపీ అవినీతి అక్రమాలు, ప్రభుత్వంపై ప్రజాగ్రాహాన్ని ప్రజల ముందు బయటపెడుతున్నందునే మీడియాపై దాడులకు తెగబడుతున్నారన్ని మాజీ ఎమ్మెల్యే సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ సోమవారం అన్నారు. రాప్తాడులో జగన్‌రెడ్డి సభలో ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్టు శ్రీకృష్ణపై జరిగిన దాడిని నరేంద్ర కుమార్ తీవ్రంగా ఖండించారు. అలాగే ఇటీవల అమరావతిలో ఈనాడు విలేకరిపై జరిగిన దాడిని ఖండించారు. కొన్ని మీడియాలపై జగన్‌రెడ్డి పెంచుకున్న వ్యతిరేకత, కక్షతో ఈ దాడులు జరగుతున్నాయన్ని ధ్వజమెత్తారు. వృత్తినే దైవంగా భావించి పనిచేస్తున్న పాత్రికేయులపై దాడి చేయించటం అమానుష చర్యగా పేర్కొన్నారు. ప్రజా విశ్వాసం కోల్పోయి రానున్న ఎన్నికల్లో ఓటమి తప్పదని తెలుసుకున్న జగన్‌రెడ్డి ఆయన పార్టీ శ్రేణులు అసహనంతో ఆంధ్రజ్యోతి విలేకర్లపై దాడులకు పూనుకుంటున్నారన్ని ఆరోపించారు. ఆంధ్రజ్యోతి విలేకరి శ్రీకృష్ణపై జరిగిన దాడిని ప్రజాస్వామ్యవాదులు అందరూ ఖండించానల్ని నరేంద్ర కుమార్ డిమాండ్ చేశారు.

జగన్ ఐదేళ్ల విధ్వంసంపై చర్చకు సిద్ధమా?

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు



చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 19: సిద్ధ అంటూ ఊరూరా సభలు పెడుతున్న సీఎం జగన్ తన ఐదేళ్ల విధ్వంసం పై చర్చకు సిద్ధమా? అని మాజీమంత్రి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు ప్రత్తిపాటి పుల్లారావు సవాల్ విసిరారు. ప్రజావేదిక కూల్చటంతో మొదలైన విధ్వంసం పోలవరంలో మొదలైన రివర్స్ టెండరింగ్, అమరావతి ఉసురు తీస్తూ మొదలు పెట్టిన మూడు ముక్కలాట, అంతక ముందే కోడి కత్తి డ్రామా, గొడ్డలి వేటు రాజకీయం ఇలా ఎన్ని విధాలుగా జగన్ ప్రజలకు కీడు, రాష్ట్రానికి చేటు చేశారో చెప్పటానికి మేము సిద్ధం, చర్చకు మీరు సిద్ధమా? అని వైసీపీ నాయకుల పైనిప్పులు చెరిగారు. సోమవారం పట్టణంలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ పది రూపాయలు ఇచ్చి వంద రూపాయలు దోచుకోవటమే జగన్ మార్క్ సంక్షేమమా? అని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ రెక్కలు విరిచి వేయటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. 2019 ఎన్నికలే తనకు చివరి ఛాన్స్ అని తెలిసి జగన్ అంతులేని దోపిడీకి పాల్పడ్డారన్నారు. ఇసుక, మైనింగ్, మద్యం, కాంట్రాక్ట్‌లలో భూ దోపిడీల్లో వేల కోట్లు దోచేశారని, హత్యలు, అరెస్టులు కూల్చివేతల రాజకీయాలతో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించరన్నారు. అనంతపురం జిల్లా రాప్తాడులో సీఎం సభలో ఆంధ్రజ్యోతి కెమేరామెన్‌పై జరిగిన దాడి అత్యంత హేయమని, నిందితులను వెంటనే అరెస్టు చేయాలని ప్రత్తిపాటి డిమాండ్ చేశారు.

బస్ ఢీకొని వృద్ధురాలి మృతి

చెరుకుపల్లి, ఫిబ్రవరి 19: బస్ ఢీకొని రోడ్డు దాటుతున్న మహిళ మృతి చెందిన ఘటన చెరుకుపల్లిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సురేష్ తెలిపిన కథనం ప్రకారం.. చెరుకుపల్లిలోని కొత్తపేటకు చెందిన సుశీల(62) ఐలాండ్ సెంటర్‌లో రోడ్డు దాటుతుండగా బస్సు ఢీకొంది. మహిళకు రెండు కాళ్ళు విరగ్గా దగ్గరలో ఓ ప్రయివేటు వైద్యశాలకు తరలించారు. వైద్యం చేస్తుండగానే మహిళ మృతి చెందినట్లు చెప్పారు. సుశీలకు కుమారుడు సుబ్బారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.42 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	150, 159,170
చికెన్ విత్ స్కిన్	290.00
చికెన్ స్కిన్ లెస్	300.00

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

పెండింగ్ అర్జీలు ఉండకూడదు

● కలెక్టర్ పీ.రంజిత్‌బాషా
● స్పందనలో ప్రజల నుంచి అర్జీల స్వీకరణ
● పరిష్కరించాలని అధికారులకు ఆదేశం


స్పందనలో అర్జీలు స్వీకరించి సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్

బాపట్ల,ఫిబ్రవరి 19: స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వస్తున్న అర్జీలు పెండింగ్‌లో ఉండరాదని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి వివిధ ప్రాంతాలు నుంచి వచ్చిన ప్రజల అర్జీలు స్వీకరించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తన పరిధిలోని వాటికి తక్షణమే పరిష్కారం చూపించి మిగిలిన వాటిని పరిశీలన నిమిత్తం విచారించవల్సిందిగా సంబంధితాధికారులను ఆదేశించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన అర్జీలు ఎట్టి పరిస్థితులలో గడువులోగా పరిష్కరించాలన్నారు. నమోదైన అర్జీలు పెండింగ్‌లో ఉండరాదని హెచ్చరించారు. బాపట్ల ఆర్డీవో పరిధిలో ఆరు, పంచాయతీశాఖలో మూడు అర్జీలు పెండింగ్‌లో ఉండటంపై ఆరా తీశారు. మిగిలిన శాఖలో అర్జీలను పెండింగ్‌లో లేకుండా చూచుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ సి.హెచ్.శ్రీధర్, వివిధశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సర్వేయరు కూలి డబ్బులు చెల్లించలేదు..

బాపట్ల రూరల్ : జగనన్న భూ హక్కు కార్యక్రమంలో భాగంగా భూ రీసర్వే హద్దురాళ్ళను పాతే కార్యక్రమంలో తాము కూలీలుగా పని చేశామని, ఇందుకుగాను కూలీలకు చెల్లించాల్సిన డబ్బులను మార్టూరు మండల సర్వేయర్ చెల్లించలేదని, అడిగినా ఇవ్వడం లేదని కోలలపూడి గ్రామానికి చెందిన గాలి నాగేశ్వరరావు, అదే గ్రామానికి చెందిన బాధితులు సోమవారం స్పందన కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. సుమారు తమకు రూ. 6,23,775 ఇవ్వాల్సి ఉందని, పని పూర్తయి 10 నెలలు గడిచినా ఇంతవరకు డబ్బు ఇవ్వలేని అధికారులు జోక్యం చేసుకొని తమ డబ్బులను ఇప్పించాలని విన్నవించారు.

ఎన్నికల్లో బ్యాలెట్ పేపరు ఉపయోగించాలి..

రానున్న ఎన్నికలలో ఈవీఎంలను రద్దు పరిచి గతంలో మాదిరి బ్యాలెట్ బాక్స్‌ల ద్వారా ఎన్నికల ప్రక్రియను కొనసాగించాలంటూ ముస్లిం ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు మౌలాబేగ్ కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌లపై ప్రజలకు అనేక సందేహాలున్నాయని, వాటిస్థానంలో పాత పద్ధతిలో బ్యాలెట్ పేపరు ఉపయోగించి ఎన్నికలు నిర్వ హించాలని కోరారు. కార్యక్రమంలో వేదిక జిల్లా నేత అబ్దుల్‌ఖాదర్ జిలానీ ఉన్నారు.

ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలి : ఎస్పీ వకుల్ జిందాల్

స్పందన ఫిర్యాదులపై సత్వరమే చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ వకుల్ జిందాల్ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 50 ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదుదారుల అర్జీలు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్న ఎస్పీ పోలీసు సిబ్బందికి పలుసూచనలు చేశారు. చట్టపరిధిలో అర్జీలపై విచారించి బాధితులకు తగిన న్యాయం చేయాలని పోలీసులను ఆదేశించారు. సంబంధిత పోలీసుస్టేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదులపై సూచనలుచేశారు. స్పందన ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ పీ.మహేష్, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ పీ.మురళీకృష్ణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టు సంఘాల నాయకులు

జర్నలిస్టులపై దాడి ప్రజాస్వామ్యానికే ప్రమాదం

● ఏబీఎన్ పొటోగ్రాఫర్‌పై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి
● ఏపీయూడబ్ల్యుజే జిల్లా అధ్యక్షుడు సీహెచ్.రాంబాబు

బాపట్ల, ఫిబ్రవరి 19: పాత్రికేయులపై దాడులకు పాల్పడటం దుర్మార్గమని, అది ప్రజాస్వామ్య మనుగడకే ప్రమాదమని ఏపీయూడబ్ల్యుజే జిల్లా అధ్యక్షుడు సీహెచ్.రాంబాబు అన్నారు. ఏబీఎన్ ఆంధ్రజ్యోతి పొటోగ్రాఫర్‌పై వైసీపీ మూకలు దాడికి పాల్పడి గాయపర్చటాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు బాపట్ల జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులు వార్తల కవరేజ్‌కి వెళ్ళాలంటే భయపడే పరిస్థితి రాష్ట్రంలో నెలకొని ఉందన్నారు. ప్రజాప్రతినిధులు ఇలాంటి దాడులను ప్రోత్సహించటం మంచి పరిణామం కాదన్నారు. ముఖ్యమంత్రి సభలోనే పాత్రికేయులకు భద్రత లేకపోతే ఎలా అని ప్రశ్నించారు? ఇలాంటి దాడులను ప్రజాసంఘాలు ముక్తకంఠంతో ఖండించాలన్నారు. పోలీసులు వెంటనే స్పందించి దీనిపై చర్యలు తీసుకోవాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బాపట్ల జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బీ.ధనరాజు, గౌరవాధ్యక్షుడు జి.సురేష్‌కుమార్, ఏపీయూడబ్ల్యుజే జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా శ్రీనివాసరావు, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు ఉప్పాల శ్రీనివాసరావు, ఎస్.నవీన్‌బాబు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పొటోగ్రాఫర్‌పై దాడి హేయం : అన్నంసతీష్ ప్రభాకర్

ఏబీఎన్ పొటోగ్రాఫర్‌పై వైసీపీ శ్రేణులు దాడికి పాల్పడటం హేయమైన చర్యయని మాజీ ఎమ్మెల్సీ, బీజేపీనాయకులు అన్నంసతీష్ ప్రభాకర్ అన్నారు. పాత్రికేయులపై దాడి చేయటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆయన తెలిపారు. దీనికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

పాత్రికేయులపై వైసీపీ రౌడీమూకలు దాడి చేయటం దారుణమని, వైసీపీ మూకల చర్యలను ప్రజలంతా ఖండించాలని టీడీపీ బాపట్లపార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పల్లంసరోజినీ అన్నారు. అలాగే అనంతపురంలో జరిగిన సంఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.


మహిళలకు చీర, సంచి అందసేస్తున్న వేగేశన నరేంద్రవర్మ తదితరులు

టీడీపీ గెలుపుతోనే బాపట్ల అభివృద్ధి

● టీడీపీ బాపట్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, ఫిబవరి 19 : టీడీపీ ప్రభుత్వం ఏర్పడటం ద్వారానే బాపట్ల నియోజకవర్గంలో అభివృద్ధి సాధ్యమవుతుందని టీడీపీ బాపట్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ అన్నారు. సోమవారం వేగేశన నరేంద్రవర్మ టీడీపీ-జనసేన నేతలతో కలిసి బాపట్ల మండలం అడవి పంచాయతీ కొత్త ఓడరేవు, రామచంద్రాపురం, పాండురంగాపురం గ్రామాలలో 'ఇంటింటికి టీడీపీ మీమాట-నాబాట, జనసేన టీడీపీ జనబాట' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగాటీడీపీ-జనసేన ఉమ్మడి మేనిఫెస్టోను గురించి మహిళలకు వివరించారు. అలాగే తన గురించి వివరించే పుస్తకం, చీర, చేతి సంచి ఇచ్చి టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ-జనసేన పార్టీల నేతలు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

543 సిమెంటు బస్తాలు మాయం

● నిర్మాణానికి నోచుకోని భవనం.. తహసీల్దారుకి ఫిర్యాదు

భట్టిప్రోలు, ఫిబ్రవరి 19 : భట్టిప్రోలు గ్రామ సచివాలయం -2 నిర్మాణానికి కేటాయించిన 543 సిమెంటు బస్తాలు మాయమైనట్లు మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ సలీం సోమవారం మండల తహసీల్దార్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. రెండేళ్ల క్రితమే భవన నిర్మాణ పనులు ప్రారంభించాల్సి ఉండగా నేటికీ శంకుస్థాపనకు నోచుకోలేదని, దీని కారణంగా సచివాలయం అద్దె భవనంలోనే కొనసాగుతుందన్నారు. ఇప్పటికీ పంచాయితీ నిధుల నుంచే సచివాలయ భవన అద్దెను చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే అద్దె చెల్లింపు పంచాయతీకి భారంగా మారిందని, అద్దె చెల్లించని కారణంగా భవన యజమాని ఇటీవల సచివాలయానికి తాళాలు వేసిన సందర్భం లేకపోలేదన్నారు. సచివాలయ నిర్మాణం జరగకపోయినా సిమెంటు బస్తాలు మాయం అవడం ఏంటని, సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, సచివాలయం నిర్మాణ పనులు ప్రారంభించాలని సలీం కోరారు.

మహాశివరాత్రి ఉత్సవాల నిర్వహణపై సమీక్ష

రేపల్లె, ఫిబ్రవరి 19 : స్థానిక ఆర్డీవో కార్యాలయంలో గోవాడ మహాశివరాత్రి ఉత్సవాలపై వివిధశాఖల అధికారులతో రేపల్లె ఆర్డీవో హెలా సోరెన్ మొదటి కో-ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉత్సవాలకువచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా, ఉత్సవాల్లో ఏ అవాంచనీయ సంఘటనలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈవో అశోక్‌రెడ్డి మాట్లాడుతూ ఆలయం వద్ద చలువ పందిళ్లు, వాహన పార్కింగ్, విద్యుత్ అలంకరణ, క్యూ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో డీఎస్పీ మురళీకృష్ణ, ఆలయ పాలక మండలి చైర్మన్ ఆలపాటి రమాదేవి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఛత్రపతి శివాజి జయంతి

బాపట్ల, ఫిబ్రవరి 19 : పట్టణంలో హితైషిణి నిలయం శీలంవారి పాలెం నందు విశ్వహిందూ పరిషత్ బాపట్ల పట్టణాధ్యక్షురాలు బండ్రెడ్డి రజనీ ఆధ్వర్యంలో సోమవారం శివాజి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఛత్రపతి శివాజి మహరాష్ట్రంలోనే కాకుండా భారతదేశమంతటా గర్వించబడ్డారన్నారు. ఈసందర్భంగా విశ్వహిందు పరిషత్ సభ్యులు ఛత్రపతి శివాజి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులు అర్పించారు. కార్యక్రమంలో బాపట్ల విశ్వ హిందూపరిషత్ సభ్యులు మద్దుల వెంకటేశ్వరరావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


కలశాలకు మహా కుంబాభిషేకం చేస్తున్న సచ్చిదానంద సరస్వతి మహాస్వామి

వైభవంగా గాలిగోపుర కలశ ప్రతిష్ఠాపన

● మహ కుంబాభిషేక మహోత్సవంలో పాల్గొన్న భక్త జనం

కొల్లూరు, ఫిబ్రవరి 19: అనంత భోగేశ్వర స్వామి ఆలయ గాలి గోపుర కలశ ప్రతిష్ఠాపన, మహ కుంభాషేక మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. సోమవారం కొల్లూరులోని గంగాపార్వతి సమేత అనంత భోగేశ్వర స్వామి దేవస్థానం గాలిగోపుర నిర్మాణాన్ని కామాక్షి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భాగవతుల మధుసూదనశర్మ, సావిత్రమ్మలు నిర్మించిన దేవాలయ గాలిగోపురం, మహాకుంబాభిషేకం కంచికామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి మహాస్వామి దివ్యానుగ్రహంతో మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. సోమవారంగాలిగోపురంపై బ్రహ్మ కలశాల స్థాపన, మహాకుంబాభిషేక కార్యక్రమాలను తుని తపోవన మఠాధిపతులు పరమహంస సచ్చిదానందసరస్వతి మహాస్వామి నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పార్వతీ సమేత అనంత భోగేశ్వర స్వామి కళ్యాణం, మహానివేదన జరిపారు. అనంతరం సుమారు 10 వేల భక్తులకు అన్న సంతర్పణ చేశారు. ఆయా కార్యక్రమాలను ఆలయ కార్య నిర్వహణాధికారి మంతెన అనుపమ, దేవస్థాన చైర్మన్ యడ్ల వెంకటేశ్వరరావు, గాలి గోపుర నిర్మాణ, కలశ ప్రతిష్ఠ మహాకుంబాభిషేక నిర్వాహకులు డాక్టర్ భాగవతుల సూర్యనారాయణమూర్తి, భాగవతుల ఆనంద్ మోహన్, భాగవతుల శ్రీనివాస్, కామాక్షి చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహక అధ్యక్షులు కల్లూరి వెంకట సూర్యనారాయణమూర్తి పూజాది కార్యక్రమాలలో పాల్గొన్నారు.

హెల్మెట్‌లు ప్రాణానికి రక్షణ కవచం

● 35వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల ముగింపు కార్యక్రమంలో కలెక్టర్ పి.రంజిత్‌బాషా


జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల, ఫిబ్రవరి19: హెల్మెట్ ధరించి ద్విచక్రవాహనాలు నడపటం ప్రాణానికి రక్షణ ఉంటుందని కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. 35వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల ముగింపు కార్యక్రమం సోమవారం కలెక్టరేట్ ఆవరణంలో నిర్వహించారు. హెల్మెట్‌పై అవగాహన కల్పిస్తూ ఏర్పాటు చేసిన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ప్రమాదాల నివారణపై ప్రజలు అవగాహన కలిగియుండాలని ఫ్లకార్డులు ప్రదర్శించారు. మాసోత్సవాలలో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన వక్తృత్వ, క్విజ్ పోటీల్లోని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రహదారి భద్రత ప్రజలందరి బాధ్యత అన్నారు. దీనిపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. రహదారిపై ప్రజలు ప్రయాణించే సమయంలో ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రజల ప్రాణాలను రక్షించవచ్చుఅన్నారు. ద్విచక్రవాహనాలు నడిపే ప్రజలు హెల్మెట్ ధరించటం ద్వారా ప్రమాదాలు అరికట్టవచ్చుఅని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా రవాణాశాఖాధికారి ఆర్.సురేష్, ఏపీఎస్ ఆర్టీసీ ఆర్ఎం వీ.కృష్ణారెడ్డి, మోటారు వాహనాల తనిఖీ అధికారులు డీబీవీ రంగారావు, ఎన్.ప్రసన్నకుమారి, అంకమ్మరావు, బీ.కిషోర్, శ్రీమన్నారాయణ, సాల్మన్, డ్రైవర్లు, ప్రజలు పాల్గొన్నారు.


గణపతి ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న తాళ్ళాయపాలెం శివస్వామి

వైభవంగా శివాలయ ప్రతిష్ఠ

● తాళ్ళాయపాలెం శివస్వామి చేతుల మీదుగా విగ్రహాల ప్రతిష్ఠ

వేమూరు, ఫిబ్రవరి 19: మండలంలోని అబ్బనగూడవల్లిలో అత్యంత సుందరంగా నిర్మించిన గంగా అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ఠా కార్యక్రమం సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. శైవాగమ పండితులు మామిళ్ళపల్లి వెంకటసుబ్బరాయ శర్మ ఆధ్వర్యంలో జరిగిన క్రతువులో తాళ్ళాయపాలెం ఆశ్రమ అధిపతి శివ సన్నిధాన వ్యవస్థాపకులు శివస్వామి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన చేతుల మీదుగా కాశీలో అఘోరా శివాచార్యులచే పూజింపబడిన సాలిగ్రామ కృష్ణశిలా రూప శివలింగం స్పటిక లింగాలతో పాటు గంగాదేవి, అన్నపూర్ణాదేవి, పరివార దేవతలైన గణపతి సుబ్రహ్మణ్యేశ్వర ద్వార పాలక చండీశ్వర నందీశ్వర కాలభైరవ ఆంజనేయ నవగ్రహాలు, సింహ, మూషిక, వాహనాలు నాగ ప్రతిమలు ఆలయ శిఖర కలశాలు జీవధ్వజస్థంభం శీతలబాదేవి గవిడి రాళ్ళ ప్రతిష్ఠలు జరిగాయి. అనంతరం పూర్ణాహుతి కార్యక్రమం జరిపి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో అనేక రంగాలకు చెందిన ప్రముఖులైన వ్యక్తులు పలు రాజకీయ పార్టీలకు చెందిన నేతలు పాల్గొన్నారు.

ముస్లిం వార్డు మెంబర్లకు ఘన సన్మానం

కర్లపాలెం, ఫిబ్రవరి 19 : అబ్దుల్ కలాం ఫౌండేషన్ కర్లపాలెం కార్యాలయంలో కర్లపాలెం పంచాయతీలోని ముస్లిం మాజీ వార్డు మెంబర్లకు సోమవారం ఘనంగా సన్మానం చేసినట్లు ఫౌండేషన్ ప్రెసిడెంట్, గ్రామ ఉపసర్పంచ్ పఠాన్ అహ్మద్‌బాషా తెలిపారు. సయ్యద్ జిక్రియ, షేక్.నజీర్, షేక్.సలీం, షేక్.బాబావలి, షేక్.కరీమూన్, షేక్.ఖమ్మరున్నిసా, పఠాన్‌మాలీన్‌బి, షేక్.ప్యారిమున్, పఠాన్ అజీంఖాన్, షేక్.సబీ, రిటైర్డ్ ఉద్యోగి పఠాన్ కరుముల్లా ఖాన్‌లను దుశ్శాలువాలతో పూలదండలతో ఘనంగా సన్మానించటం జరిగిందన్నారు. ఈ సందర్భంగా వారి సేవలను గ్రామ ఉపసర్పంచ్ పఠాన్ అహ్మద్‌బాషా కొనియాడారు.

తహసీల్దారు స్పందనకు ఎనిమిది అర్జీలు

పిట్టలవానిపాలెం, ఫిబ్రవరి 19 : మండల కేంద్రమైన పిట్టలవాని పాలెం తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం మండల తహసీల్దార్ ఐ.మునిలక్ష్మీ అధ్యక్షతన మండల స్థాయి అధికారులతో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాలు నుండి భూ సమస్యపై ఐదు అర్జీలు, అదేవిధంగా వివిధ సమ్యలపై మూడు అర్జీలు వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో బీవీ.రమణార్తి, మండల విద్యాశాఖాధికారి-1 ఉయ్యూరి వెంకటేశ్వరరావు, ఏపీఎమ్ సంతోష్, ఏపీవో ఎం.సుబాషిణి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గోవాడ అన్నసత్రం క్యాలెండర్ ఆవిష్కరణ

భట్టిప్రోలు, ఫిబ్రవరి 19 : పవిత్ర శివరాత్రిని పురస్కరించుకుని గోవాడలో వేంచేసియున్న బాలకోటేశ్వరస్వామి దేవస్థానం లీలాభవాని పద్మశాలీయ బహూత్తమ సంఘం అన్నసత్రం క్యాలెండర్లను సోమవారం ఆవిష్కరించారు. గోవాడ పద్మశాలీయ అన్నసత్రం క్యాలెండర్లను ఆవిష్కరించి సంఘీయులకు పంపిణీచేశారు.కార్యక్రమంలో అన్నసత్రం అధ్యక్షులు మాచర్ల నాగరాజు, వామనపల్లి కోటేశ్వరరావు, దీపాల శివ ప్రసాద్, నాగేశ్వరరావు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపల్లె ఆర్డీవో స్పందనకు ఏడు అర్జీలు

రేపల్లె, ఫిబ్రవరి 19: స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఏడు అర్జీలు స్వీకరించామని ఆర్డీవో హేలా షోరాన్ తెలిపారు. కొల్లూరు మండలం గాజుల్లంక గ్రామానికి చెందిన లంకభూములకు పట్టా మంజూరు చెయ్యాలని, రేపల్లె మునిసిపాలిటీలో భూమి పత్రాలకు సంబందించిన రిజిష్ట్రేషన్ దస్తావేజులు ఇప్పించాలని, మునిసిపాల్టీలో తనకు లేని రైస్‌మిల్లు డిమాండ్ నోటీస్‌ను రద్దు చెయ్యాలని, నిజాంపట్నం మండలం కూచినపూడి గ్రామానికి చెందిన పొలాలను ఆన్‌లైన్ చెయాలని, రేపల్లె పట్టణంలో ఇంటి స్థలానికి పొజిషన్ సర్టిఫికేట్ మంజూరు చెయాలని, పొలంలో వేసిన డ్రెయినేజీని తొలగించాలని, రైతుభరోసా ఇప్పించాలని.. ఇలా ఏడుగురు అర్జీదారులు దరఖాస్తులు చేశారన్నారు. అర్జీలను ఆయా శాఖలకు పంపి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భట్టిప్రోలు, ఫిబ్రవరి 19 : భట్టిప్రోలు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా మంగళవారం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ ఏడుకొండలు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లోని విద్యుత్ వినియోగదారులు గమనించి అధికారులకు సహకరించాలని ఏడుకొండలు కోరారు.

ఉపాధ్యాయుడికి ఓకేషనల్ అవార్డు

భట్టిప్రోలు,ఫిబ్రవరి19: మండలంలోని ఐలవరం గ్రామానికి చెందిన ఆంగ్ల ఉపాధ్యాయుడు పచ్చారు హరికృష్ణకు రేపల్లె రోటరీ క్లబ్ సభ్యుల ఓకేషనల్ అవార్డును ప్రదానం చేశారు. సోమవారం స్థానిక రామకృష్ణ విద్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో రోటరీ గవర్నర్ శంకర్‌రెడ్డి చేతుల మీదుగా హరికృష్ణకు ఓకేషనల్ అవార్డును అందజేసి దంపతులను సత్కరించారు. ఆంగ్ల ఉపాధ్యాయునిగా హరికృష్ణ వినూత్న కార్యక్రమాలతో రాష్ట్ర, జిల్లా, దేశఖ్యాతిని విదేశాలకు వ్యాపింపచేశారని, గ్రామీణ ప్రాంత విద్యార్థులను ఆంగ్ల భాషలో పట్టు సాధించే విధంగా, ఇతర దేశాల ప్రొఫెసర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో ఆంగ్ల భాషలో సంభాషించేలా తీర్చిదిద్దారని క్లబ్ సభ్యులు కొనియాడారు. విద్యాబోధనలో నోబెల్ బహుమతిగా పేరుపొందిన గ్లోబల్ టీచర్ ప్రైజ్ మొదటి 50 మంది జాబితాలో హరికృష్ణ నిలవడం గర్వకారణంగా ఉందన్నారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న టీఎన్ఎస్ఎఫ్, టీడీపీ నాయకులు

యువత ఓటర్లగా నమోదు కావాలి

● టీఎన్ఎస్ఎఫ్ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు మువ్వా శరత్

బాపట్ల,ఫిబ్రవరి 19 : యువత ఓటర్లగా నమోదు కావాలని టిఎన్ఎస్ఎఫ్ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు మువ్వాశరత్ కోరారు. అధిష్ఠానం ఆదేశాల మేరకు బాపట్ల టీడీపీ కార్యాలయంలో సోమవారం 'మై ఫస్ట్ ఓటు ఫర్ సీబీఎన్' కార్యక్రమంపై నాయకులు, వారియార్స్‌తో సమావేశం నిర్వహించారు. శరత్ మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే యువతకు ఉద్యోగవకాశాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో వేగేశన రాకేష్‌వర్మ, తాతా హరిచంద్ర, పల్లం సరోజనీ, గ్లోరియానేట్, పరిశా గోపి, తెలుగుదేశంపార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి జయప్రకాష్ నారాయణ, నవీన్, నాగరాజు, గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తీరప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలు

● రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు
● ప్రభుత్వాస్పత్రిలో నూతన భవనం ప్రారంభం


ఆస్పత్రి భవనాన్ని ప్రారంభిస్తున్న మోపిదేవి వెంకటరమణారావు తదితరులు

రేపల్లె, ఫిబ్రవరి 19: తీరప్రాంతంలో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వ ఆస్పత్రిలో నూతన భవనాన్ని నిర్మించామని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో రూ.కోటి 11 లక్షలతో నూతనంగా నిర్మించిన భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి పేద, మధ్య తరగతి కుటుంబాల వారికి కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ వైద్యాన్ని అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. రేపల్లె నియోజకవర్గంలో రేపల్లె, విశ్వేశ్వరం, వైద్యశాలను నూతనంగా నిర్మించి వైద్యసేవలను అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దేవినేని మల్లికార్జునరావు, వైసీపీ నియోజకవర్గ సమన్వయ కర్త డాక్టర్ ఈవూరి గణేష్, వైసీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి, మునిసిపల్ చైర్‌పర్సన్ కట్టామంగా, వైస్ చైర్మన్ టీ.కాశీవిశ్వనాథగుప్తా, గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, డాక్టర్ వసంతం వీరరాఘవయ్య పాల్గొన్నారు.


విద్యార్థుల వసతి గృహంలో తనిఖీ నిర్వహిస్తున్న డీఎస్పీ వెంకటేశులు, పోలీసులు

నేరాల నియంత్రణకే కార్డన్ సెర్చ్

● విద్యార్థుల వసతి గృహాల్లో పోలీసుల తనిఖీ

బాపట్ల, ఫిబ్రవరి 19 : నేరాల నియంత్రణకే పోలీసుశాఖ ఆధ్వర్యంలో కార్డెన్‌సెర్చ్ నిర్వహిస్తున్నట్లు డీఎస్పీ టీ.వెంకటేశులు తెలిపారు. బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో ఉన్న వసతిగృహాలు మొత్తం సోమవారం తెల్లవారుజామున పోలీసు సిబ్బందితో కలిసి డీఎస్పీ తనిఖీలు చేశారు. ఏకకాలంలో 60 మంది పోలీసులు ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. అసాంఘిక కార్యకలాపాలు ఏమైన జరుగుతున్నాయా అనేది ఆరా తీశారు. గంజాయి, ఇతర మత్తుపదార్థాలు రూమ్‌లలో ఉన్నాయా అని పరిశీలించారు. విద్యార్థులు అసాంఘిక కార్యకలాపాలకు, మద్యం, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఈ సందర్భంగా డీఎస్పీ సూచించారు. కార్యక్రమంలో ట్రైనీంగ్ డీఎస్పీ విద్యశ్రీ, రూరల్ సీఐలు, ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

రేపల్లె, ఫిబ్రవరి 19: విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకొని రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని రోటరీక్లబ్ గవర్నర్ పోతిరెడ్డి శంకర్‌రెడ్డి అన్నారు. సోమవారం సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు ఆయన పరీక్షా మెటీరియల్‌ను అందేశారు. అలాగే ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న 10వ తరగతి, ఇంటర్ పరీక్షల్లో ప్రతి విద్యార్థి ఉత్తమ ఫలితాలను సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ కన్నెగంటి మురళీకృష్ణ, రోటరీక్లబ్‌అధ్యక్షులు మాదాల మోహన్‌రావు సక్సేనా, కార్యదర్శి పావులూరి శివశంకర్ ప్రసాద్, కోశాధికారి వేపూరి, మల్లెల రామచంద్రరావు పాల్గొన్నారు.

సాయిబాబా మందిరంలో అన్నదానం

బాపట్ల,ఫిబ్రవరి 19: పట్టణంలోని కొత్తబస్టాండ్‌లో వేంచేసియున్న శ్రీషిరిడి సాయిబాబా దేవాలయం 28వ ప్రతిష్ఠ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం కర్పూర హారతి, ప్రత్యేక అభిషేకం, మధ్యాహ్నహారతి, అన్నసంతర్పణ అనంతరం సాయిబాబా నగరోత్సవం వైభవంగా జరిగింది. కార్యక్రమానికి ఎమ్మెల్యే కోన రఘుపతి ముఖ్యఅతిథిగా పాల్గొని పూజలు నిర్వహించి భక్తులకు అన్న ప్రసాదం అందజేశారు. అదేవిధంగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో వైసీపీ పట్టణాధ్యక్షులు కాగిత సుధీర్ బాబు, షిరిడి సాయిబాబా సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.


అంజుమన్ ఇస్లామియా కమిటీ నూతన కార్యవర్గం

అంజుమన్‌కమిటీ అధ్యక్షుడిగా అబ్దుల్ రహీమ్‌జానీ

బాపట్ల, ఫిబ్రవరి 19 : బాపట్ల అంజుమన్ ఇస్లామియా నూతన కమిటీని సోమవారం ప్రకటించారు. అధ్యక్షుడిగా షేక్.అబ్దుల్ రహీమ్‌జానీ, కార్యదర్శిగా షేక్.అబ్దుల్ కరీమ్‌లు ఎన్నికయ్యారు. పోటాపోటీగా జరిగిన ఈ ఎన్నికకు ఎన్నికల అధికారిగా వీ.సత్యనారాయణ వ్యవహరించారు. ఉపాధ్యక్షుడిగా షేక్.బాజివలి, సంయుక్త కార్యదర్శిగా మహ్మద్ రఫీ, కోశాధికారిగా షేక్.మీరాసాహేబ్, కార్యవర్గ సభ్యులుగా అబ్దుల్ సత్తార్, షేక్.మౌలాలి, షేక్.ఆదం,షేక్.ఖాశీం, షేక్.ఖాదర్‌బాషా, అబ్దుల్ ముజీర్‌లను ఎన్నుకున్నారు. డీఎస్పీ టీ.వెంకటేశులు, సీఐ శ్రీనివాసులు ఎన్నికల నిర్వహణకు బందోబస్తు నిర్వహించారు.

ఈఈఎంటీలో తృతీయ స్థానం

నగరం, ఫిబ్రవరి 19: ఇటీవల జరిగిన ఈఈఎంటీ (ఎడ్యుకేషనల్ ఎంపిపనీ మెరిట్ టెస్ట్) 2024 పరీక్షల్లో నగరం మండల పరిషత్ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థి పీ.జ్యోతిరసాయి బాపట్ల జిల్లా స్థాయిలో తృతీయ స్థానంలో నిలిచి బహుమతి కైవసం చేసుకున్నారు. ఉపాధ్యాయులు పి.శ్రీనివాసరావు శిక్షణనిచ్చారు. ప్రశంసాపత్రం జ్ఞాపిక రూ.4వేలు నగదును కోడ్ తంత్ర సీఈవో రమణ, ఈఈఎంటి సభ్యులు, రాష్ట్ర విద్యాశాఖాధికారులు అందించారు. ఈవిద్యార్థిని ప్రధానోపాధ్యాయులు వై.రాజేశ్వరి, ఉపాధ్యాయులు కె.శ్యామల, సిహెచ్ బ్రహ్మేశ్వరరావు, కె.నరేంద్రబాబు, కోటేశ్వరరావు, సహదేవరావు, బాబూరావులు అభినందనలు తెలిపారు.

ముస్లిం వార్డు మెంబర్లకు ఘన సన్మానం

కర్లపాలెం, ఫిబ్రవరి 19 : అబ్దుల్ కలాం ఫౌండేషన్ కర్లపాలెం కార్యాలయంలో కర్లపాలెం పంచాయతీలోని ముస్లిం మాజీ వార్డు మెంబర్లను సోమవారం ఘనంగా సన్మానంచినట్లు ఫౌండేషన్ ప్రెసిడెంట్, గ్రామ ఉపసర్పంచ్ పఠాన్ అహ్మద్‌బాషా తెలిపారు. సయ్యద్ జిక్రియ, షేక్.నజీర్, షేక్.సలీం, షేక్.బాబావలి, షేక్.కరీమూన్, షేక్.ఖమ్మరున్నిసా, పఠాన్‌మాలీన్‌బి, షేక్.ప్యారిమున్, పఠాన్ అజీంఖాన్, షేక్.సబీ, విశ్రాంత ఉద్యోగి పఠాన్ కరుముల్లా ఖాన్‌లను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారి సేవలను పఠాన్ అహ్మద్‌బాషా కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ షేక్.బాజి, హైదాబాద్ వలి, పిట్ల వసంతరెడ్డి, సయ్యద్ రఫీ, షేక్.జానీబాష, షేక్.హబీబ్, షేక్.జిలానీ, షేక్.రియాస్, పఠాన్ కరీముల్లా, ఉప్పలపాటి వెంకటేశ్వరరాజు తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ప్రసాదం అందజేత

కర్లపాలెం, ఫిబ్రవరి 19 : కర్లపాలెం ఐలెండ్ సెంటర్‌లో వైసీపీ మార్కెట్ యార్డు వద్ద రాజన్న ప్రసాదాన్ని సోమవారం పంపిణీ చేశారు. కొక్కిలిగడ్డ రామరాజు, ఆధ్వర్యంలో ఈ అన్నప్రసాద పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి సోమవారం ఈ అన్నప్రసాద పంపిణీని నిర్వహిస్తున్నట్లు కొక్కిలిగడ్డ రామరాజు తెలిపారు. కార్యక్రమంలో బల్లారెడ్డి, రాతపూడి మనోహర్, యాసిన్, శ్రావణ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌రెడ్డి

పులి కాదు.. పిల్లి!

భట్టిప్రోలు, ఫిబ్రవరి 19 : పత్రికా స్వేచ్ఛను కాలరాస్తూ జర్నలిస్టులపై దాడులకు సిద్ధం కావడంతో జగన్‌రెడ్డి పులికాదు పిల్లి అని రుజువైందని కాపు ఉద్యమనేత వేల్పూరి శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాప్తాడు సిద్ధం సభలో జర్నలిస్టుపై వైసీపీ గూండాలు దాడిచేయడం హేయమన్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై అక్రమ కేసులు పెట్టించడం అధికార దుర్వినియోగానికి పాల్పడడం కాదా అని ప్రశ్నించారు. జర్నలిస్టులపై దాడిని ప్రజాస్వామ్యంపై దాడిగా భావిస్తున్నామని స్పష్టం చేశారు. పోలీసుల వైఫల్యం వల్లనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని, ఎస్పీని, డీఐజీలను తక్షణమే సస్పెండ్ చేయాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.

షుగర్ ఇన్‌స్టిట్యూట్‌లో సర్టిఫికెట్ కోర్సు

దిక్సూచి DIKSUCHI

కాన్పూర్‌లోని నేషనల్ షుగర్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్ఎస్ఐ)- 'సర్టిఫికెట్ కోర్స్ ఇన్ షుగర్ రిఫైనరీ ఆపరేషన్స్'లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం 20 సీట్లు ఉన్నాయి. రిటెన్ టెస్ట్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. కోర్సు వ్యవధి మూడు నెలలు. ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు ఫారాన్ని ఈ-మెయిల్ ద్వారా అప్‌లోడ్ చేసి హార్డ్ కాపీని కింది చిరునామాకు పంపాలి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/తత్సమాన కోర్సు ఉత్తీర్ణతతోపాటు షుగర్ ఫ్యాక్టరీ ప్రాసెసింగ్ హౌస్‌లో కనీసం రెండేళ్లు పనిచేసిన అనుభవం ఉండాలి. సంస్థ అందిస్తున్న సర్టిఫికెట్ కోర్స్ ఇన్ క్వాలిటీ కంట్రోల్ పూర్తిచేసి కనీసం రెండు సీజన్ల అనుభవం లేదా సంస్థ నుంచి షుగర్ బాయిలింగ్ సర్టిఫికెట్ కోర్సు ఉత్తీర్ణతతోపాటు మూడు సీజన్ల అనుభవం ఉన్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు 2024 ఏప్రిల్ 1 నాటికి 35 ఏళ్లు మించకూడదు. విదేశీ అభ్యర్థులను 38 ఏళ్ల వరకు అనుమతిస్తారు.

రిటెన్ టెస్ట్: పరీక్ష 100 మార్కులకు ఉంటుంది. ఇందులో రెండు సెక్షన్లు ఉంటాయి. మొదటి సెక్షన్‌లో మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల నుంచి 35 ప్రశ్నలు; రెండో సెక్షన్‌లో షుగర్ ప్రాసెస్‌కు సంబంధించి 15 ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు రెండు మార్కులు నిర్దేశించారు. పరీక్ష సమయం మూడు గంటలు. క్యాలిక్యులేటర్లను అనుమతించరు. పరీక్ష సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

ముఖ్య సమాచారం

- **ప్రోగ్రామ్ ఫీజు:** రూ.12,000(విదేశీ అభ్యర్థులకు రూ.48,000)
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.500; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.300
- **దరఖాస్తు హార్డ్ కాపీ చేరేందుకు చివరి తేదీ:** మార్చి 25
- **ఈ మెయిల్ ద్వారా అడ్మిట్ కార్డ్‌ల జారీ:** మార్చి 28 నుంచి
- **రిటెన్ టెస్ట్ తేదీ:** ఏప్రిల్ 14
- **పరీక్ష కేంద్రం:** ఎన్ఎస్ఐ, కాన్పూర్
- **రిజిస్టర్డ్ పోస్ట్/కొరియర్ ద్వారా దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** డైరెక్టర్, నేషనల్ షుగర్ ఇన్‌స్టిట్యూట్, కల్యాణ్‌పూర్, కాన్పూర్-208017
- **ఈ-మెయిల్:** nsikanpureducation@gmail.com
- **వెబ్‌సైట్:** http:// nsi.gov.in



ఏపీ సెట్ 2024

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అర్హత పరీక్ష(ఏపీ సెట్ 2024) నోటిఫికేషన్‌ను ఆంధ్ర విశ్వవిద్యాలయం విడుదల చేసింది. రాష్ట్రంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు, డిగ్రీ కళాశాలల లెక్చరర్లు నియామకానికి అర్హత సాధించేందుకు ఈ పరీక్షను ఉద్దేశించారు.

సబ్జెక్టులు: ఆంత్రోపాలజీ, హిస్టరీ, కెమికల్ సైన్సెస్, కామర్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్, ఎకనామిక్స్, ఎడ్యుకేషన్, ఇంగ్లీష్, ఎర్త్-అట్మాస్ఫియరిక్-ఓషన్ అండ్ ప్లానెటరీ సైన్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, జాగ్రఫీ, హిందీ, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్స్, లా, లైఫ్ సైన్సెస్, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్, మేనేజ్‌మెంట్, మేథమెటికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్, ఫిజికల్ ఎడ్యుకేషన్, ఫిలాసఫీ, పొలిటికల్ సైన్స్, సైకాలజీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సంస్కృతం, సోషియాలజీ, సోషల్ వర్క్, తెలుగు, ఉర్దూ, విజువల్ ఆర్ట్స్

అర్హత: కనీసం 55 శాతం మార్కులతో సంబంధిత సబ్జెక్టులో మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: గరిష్ఠ వయోపరిమితి లేదు.


పరీక్ష విధానం: పరీక్షలో రెండు పేపర్లు ఉంటాయి. పేపర్-1లో 50 ప్రశ్నలకు 100 మార్కులు, పేపర్-2లో 100 ప్రశ్నలకు 200 మార్కులు కేటాయించారు. పరీక్ష వ్యవధి మూడు గంటలు.

పరీక్ష రుసుము: జనరల్/ఈడబ్ల్యూఎస్ కేటగిరీకి రూ.1200. బీసీ కేటగిరీకి రూ.1000. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులు/ట్రాన్స్‌జెండర్ అభ్యర్థులకు రూ.700.

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: మార్చి 6

పరీక్ష తేదీ: ఏప్రిల్ 28

వెబ్‌సైట్: https://apset.net.in/



ఏపీ అంబేద్కర్ గురుకులాల్లో ఇంటర్ ప్రవేశాలు

రిమైండర్

తాడేపల్లిలోని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (ఏపీ ఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్)- రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న డా.బీ.ఆర్.అంబేద్కర్ గురుకులాలు, ఐఐటీ-మెడికల్ అకాడమీల్లో ఇంటర్ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. బీఆర్ఏజీ ఇంటర్ సెట్ 2024 ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. విద్యార్థులు సొంత జిల్లా గురుకులంలో ప్రవేశానికి మాత్రమే అప్లయ్ చేసుకోవాలి. అభ్యర్థి కోరుకున్న గ్రూప్ అక్కడ లేని పక్షంలో సంబంధిత జోన్ పరిధిలోని మరో జిల్లా గురుకులానికి అప్లయ్ చేసుకోవచ్చు. దరఖాస్తును ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన తరవాత మార్పులకు అవకాశం లేదు. ఎంపికైన అభ్యర్థులకు విద్య, వసతి ఉచితం. క్రీడలకు ప్రాధాన్యమిస్తారు.

సీట్లు: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 164 గురుకులాల్లో ఎంపీసీ 5400, బైపీసీ 5400, ఎంఈసీ 800, సీఈసీ 1600, హెచ్ఈసీ 360 సీట్లు ఉన్నాయి.

- ఐఐటీ-మెడికల్ అకాడమీల్లో మొత్తం 600 సీట్లు ఉన్నాయి. వీటిలో ఎంపీసీ, బైపీసీ గ్రూప్‌లకు సమానంగా ఒక్కోదానిలో 300 సీట్లు కేటాయించారు. కృష్ణా జిల్లా-ఈడ్పుగల్లులోని బాలికల అకాడమీలో ఎంపీసీ, బైపీసీ గ్రూప్‌లకు ఒక్కోదానిలో 160 సీట్లు ఉన్నాయి. కర్నూలు-చిన్నటేకూర్‌లోని బాలుర అకాడమీలో ఒక్కో గ్రూప్‌లో 60 సీట్లు, గుంటూరు-అడవితక్కెళ్లపాడు బాలుర అకాడమీలో ఒక్కో గ్రూప్‌లో 80 సీట్లు ఉన్నాయి.

అర్హత: ప్రస్తుతం పదోతరగతి పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. తెలుగు మీడియంలో చదివిన వారు కూడా అర్హులే. అభ్యర్థుల వయసు 2024 ఆగస్టు 31 నాటికి 17 ఏళ్లు మించకూడదు.

ఏపీ బీఆర్ఏజీ ఇంటర్ సెట్ 2024: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలన్నీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్దేశించిన పదోతరగతి సిలబస్ ఆధారంగానే ఉంటాయి. మేథమెటిక్స్ నుంచి 25, ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్, సోషల్ స్టడీస్, ఇంగ్లీష్(కాంప్రహెన్షన్ అండ్ గ్రామర్), లాజికల్ రీజనింగ్ సబ్జెక్టుల నుంచి ఒక్కోదానిలో 15 ప్రశ్నలు ఇస్తారు. అభ్యర్థులు సమాధానాలను బ్లూ/బ్లాక్ పెన్‌తో ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. సమాధానం తప్పుగా గుర్తిస్తే పావు మార్కు కోత విధిస్తారు. మొత్తం మార్కులు 100. పరీక్ష సమయం రెండున్నర గంటలు. ప్రశ్నలు తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమాల్లో ఉంటాయి. ఏపీ బీఆర్ఏజీ ఇంటర్ సెట్ 2024లో సాధించిన మెరిట్ ఆధారంగా ఐఐటీ - మెడికల్ అకాడమీల్లో ప్రవేశానికి షార్ట్‌లిస్ట్ రూపొందిస్తారు. వీరికి మాత్రమే మరో ఎంట్రెన్స్ టెస్ట్ నిర్వహిస్తారు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 23
- **ఏపీ బీఆర్ఏజీ ఇంటర్ సెట్ తేదీ:** మార్చి 10
- **ఐఐటీ-మెడికల్... టెస్ట్ తేదీ:** ఏప్రిల్ 21
- **వెబ్‌సైట్:** https://apbragcet.apcfss.in

(నిన్నటి తరువాయి)

ఎకానమీ: పరిశీలించినప్పుడు 2014లో 10, 2013లో 19 ప్రశ్నలు వచ్చాయి. ఎకానమీలో మౌలిక అంశాలపై అవగాహన పెంచుకోవాలి. బడ్జెట్, ఎకనామిక్ సర్వే నుంచి కూడా అధికంగా ప్రశ్నలు వస్తాయి. ఇటీవలి కాలంలో ఆర్బీఐ డిజిటల్ కరెన్సీ నగదు రహిత ఆర్థిక వ్యవస్థ, ఆర్బీఐ ద్రవ్య పరపతి విధానం, క్రిప్టోకరెన్సీ, స్టార్టప్ - యూనికార్న్ స్టార్టప్ వంటి అంశాలు వినిపిస్తున్నాయి. ఎంఎస్పీ(కనీస మద్దతు ధర) అంటే ఏమిటి? ఎవరు ఇస్తారు? ఏయే పంటలకు ఇస్తారు వంటివి చదవాలి. జీఎస్టీ ఆర్థిక సంఘం, భారత దేశ వృద్ధి అంచనాలు, యూపీఐకి సంబంధించి వివరంగా చదవాలి. బడ్జెట్లో ప్రభుత్వం ప్రకటించిన పథకాలు, ఆర్థిక సమీక్ష కచ్చితంగా, లోతుగా చదవాలి.

పర్యావరణం: 2020లో 10 ప్రశ్నలు, 2014, 2016లో 18 ప్రశ్నలు వచ్చాయి. పర్యావరణంలో జీవవైవిధ్యం, జీవవైవిధ్య సంరక్షణ, పర్యావరణ చట్టాలు, పర్యావరణ సంస్థలు, కమిటీలు, సమావేశాల గురించి ప్రశ్నలు వస్తాయి. వీటితోపాటు పర్యావరణ కాలుష్యానికి సంబంధించి భూ, జల, గాలి కాలుష్యం, రేడియోధార్మికత కాలుష్యం, కాలుష్య నివారణ చట్టాలు, నివారణ చర్యలు, ఓజోన్ పొర క్షీణత, గ్లోబల్ వార్మింగ్‌పై ప్రశ్నలు వస్తాయి. కాప్-27 సదస్సు గురించి చదువుతూ గతంలో జరిగిన సదస్సులు, వాటి తీర్మానాలను చదవాలి. ఏ సదస్సు ఏ అంశాన్ని ప్రధానాంశంగా తీసుకున్నదో చదవాలి. గత సంవత్సర కాలంలో రెడ్ లిస్టుకి సంబంధించి అంతరిస్తున్న జీవజాతులు, వృక్షజాతులను చదవాలి.

సివిల్స్ ప్రిలిమ్స్ ప్రిపరేషన్

తొలి మెట్టు నుంచే పట్టు సాధించాలి

ఎకానమీకి సంబంధించి ఎన్‌సీఈఆర్‌టీ 9-12 పుస్తకాలు చదివితే మౌలిక అంశాలపై అవగాహన ఏర్పడుతుంది. బడ్జెట్ 2023-24, ఎకనామిక్ సర్వే 2022-23 బాగా చదవాలి. మార్కెట్లో అందుబాటులో ఉన్న ఏదైనా ఒక స్టాండర్డ్ బుక్ చదవాలి.

జనరల్ సైన్స్: శాస్త్ర సాంకేతికతకి సంబంధించి 2019లో 7 అత్యల్పంగా, 2014లో అత్యధికంగా 16 ప్రశ్నలు వచ్చాయి. జనరల్ సైన్స్‌లో వ్యాధులు, విటమిన్‌లు, వృక్ష, జంతువులకి చెందిన సాధారణ అంశాలు ముఖ్యం. సైన్స్ అండ్ టెక్నాలజీలో కమ్యూనికేషన్స్, స్పేస్, ఐటీ, రోబోటిక్స్, బయోటెక్నాలజీ, డిఫెన్స్ వంటి అంశాల్లో నూతన ఆవిష్కరణలు, సమకాలీన డెవలప్‌మెంట్స్ పైన ప్రశ్నలు అధికంగా వస్తాయి. ఇటీవలి కాలంలో భారతదేశంతోపాటు ఇతర దేశాల అంతరిక్ష ప్రయోగాల గురించి ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది. ఈసారి చంద్రయాన్-3, ఆదిత్య ఎల్1 ప్రయోగం తదితరాలపై కచ్చితంగా చదవాలి. వార్తల్లో నిలిచిన వ్యాధులు - సంక్రమణ, నివారణ చర్యల గురించి చదవాలి.

సైన్స్ అండ్ టెక్నాలజీ: సంబంధించి 6-10వ తరగతి వరకు ఎన్సీఈఆర్టీ పుస్తకాలు చదవాలి. ముఖ్యంగా సైన్స్ అండ్ టెక్నాలజీలో వర్తమాన అంశాలపై ఎక్కువగా ప్రశ్నలు వస్తాయి. ప్రాథమిక అంశాలు మొదట చదవాలి. కరెంట్ అఫైర్స్‌తోపాటు, వివిధ మంత్రిత్వశాఖల ఇయర్ ఎండ్ రివ్యూతోపాటు అప్డేట్స్ చదవాలి. సైన్స్ అండ్ టెక్నాలజీకి సంబంధించి ప్రాథమిక అంశాలకు రవి అగ్రహారి సైన్స్ అండ్ టెక్నాలజీ బుక్ చదివితే మంచిది.

ఆ జాతులకి సంబంధించిన జంతువు, వృక్షాన్ని బాగా చదవాలి. అందులో భాగంగానే దాన్ని భారతదేశంలో చట్టానికి అన్వయించుకోవాలి.

పర్యావరణంపై ఎన్‌సీఈఆర్‌టీ ఎన్విరాన్‌మెంట్ తోపాటు శంకర్ అకాడమీ 'అవర్ ఎన్విరాన్‌మెంట్' గాని లేదా రవి అగ్రహారి 'ఎన్విరాన్‌మెంట్' గాని లేదా 'పిఎంఎఫ్ఎస్ఐఏఎస్ ఎన్విరాన్‌మెంట్' బుక్ చదవాలి. ఎన్‌సీఈఆర్‌టీ 8వ తరగతి పుస్తకంతోపాటు బయాలజీ 11లోని 13-16 చాప్టర్స్ (ఎన్విరాన్‌మెంట్ బయాలజీ) చదవాలి.

వర్తమాన అంశాలు: గడచిన సంవత్సర కాలంలో జరిగిన జాతీయ, అంతర్జాతీయ అంశాలు చదవాలి. వీటితోపాటు జాతీయ, అంతర్జాతీయ సంస్థలు విడుదలచేసే నివేదికలు, సూచికలు కచ్చితంగా చదవాలి. ఇటీవలి కాలంలో క్రీడలకు ప్రాధాన్యం పెరిగింది. వీటికి సంబంధించి పిఐబి వెబ్‌సైట్, ద హిందూ పేపర్ చదవాలి. అలాగే ఏదైనా ఒక ప్రముఖ సంస్థకి చెందిన కరెంట్ అఫైర్స్ మ్యాగజైన్ చదవాలి.

వీటితోపాటు ముఖ్యంగా జనరల్ స్టడీస్‌కి సంబంధించిన ప్రాక్టీస్ పేపర్లు రాయాలి. సుమారు 50-60 ప్రశ్నపత్రాలు ప్రాక్టీస్ చేస్తే అభ్యర్థికి నమ్మకం ఏర్పడుతుంది. ముఖ్యంగా గడిచిన 20 సంవత్సరాల్లో జరిగిన సివిల్స్ ప్రిలిమినరీ ప్రశ్నపత్రాలు ప్రాక్టీస్ చేయాలి.



ఎం.బాలలత, సివిల్స్ మెంటార్

ఏపీ జర్నలిజం కాలేజీలో అడ్మిషన్స్

హైదరాబాద్‌లోని ఏపీ కాలేజ్ ఆఫ్ జర్నలిజం- పీజీ డిప్లొమా, డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఈ కోర్సులను రెగ్యులర్, దూరవిద్య విధానాల్లో అందిస్తున్నారు.

కోర్సులు

- **పీజీ డిప్లొమా ఇన్ జర్నలిజం:** కోర్సు వ్యవధి ఏడాది. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు.
- **డిప్లొమా ఇన్ జర్నలిజం:** కోర్సు వ్యవధి ఆర్నెల్లు. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు.
- **డిప్లొమా ఇన్ టీవీ జర్నలిజం:** కోర్సు వ్యవధి ఆర్నెల్లు. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు.
- **సర్టిఫికెట్ కోర్స్ ఆఫ్ జర్నలిజం:** కోర్సు వ్యవధి మూడు నెలలు. పదోతరగతి ఉత్తీర్ణులు అర్హులు.
- **ప్రాస్పెక్టస్, దరఖాస్తు ఫారం పొందేందుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 29
- **చివరి తేదీ:** మార్చి 5
- **మొబైల్ నెం:** 9848512767; 7286013388
- **ల్యాండ్ లైన్ నెంబర్:** 040-79610940
- **వెబ్‌సైట్:** www.apcj.in

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/JV8uhJ5లో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

ధనుష్ @ 50 రాయన్




తమిళ చిత్రరంగ సూపర్‌స్టార్ ధనుష్ నటిస్తున్న 50వ చిత్రానికి 'రాయన్' అనే పేరు నిర్ణయించారు. తమిళ, తెలుగు, హిందీ భాషల్లో విడుదలయ్యే ఈ చిత్రంలో ధనుష్ ప్రధాన పాత్ర పోషించడమే కాకుండా దర్శకత్వం కూడా వహిస్తున్నారు. దర్శకుడిగా ఆయనకు ఇది రెండో సినిమా. యువ కథానాయకుడు సందీప్ కిషన్ మరో ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. కాళిదాస్ జయరామ్ కీలక పాత్ర లో నటిస్తున్నారు. ఈ ముగ్గురు ఉన్న 'రాయన్' ఫస్ట్ లుక్ పోస్టర్‌ను సోమవారం విడుదల చేశారు. ధనుష్ ఫుడ్ ట్రక్ ముందు నిలబడి ఉంటే, సందీప్ కిషన్ వాహనం లోపల, కాళిదాస్ దానిపైన కనిపించారు. ధనుష్ ఆప్రాన్ మీద రక్తపు మరకలు కనిపిస్తున్నాయి. ఈ పోస్టర్ ప్రేక్షకుల్లో ఆసక్తి పెంచుతోంది. ఎస్ జె సూర్య, సెల్వరాఘవన్, అపర్ణా బాలమురళి, ధుషార విజయన్ ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఏ.ఆర్. రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. ఓం ప్రకాశ్ డీఓపీ. యాక్షన్ కొరియోగ్రాఫర్‌గా పీటర్ హెయిన్ వ్యవహరిస్తున్నారు. ఈ ఏడాదే చిత్రాన్ని విడుదల చేస్తామని చిత్ర నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ ప్రకటించింది.



ప్రముఖ నిర్మాత దిల్ రాజు సోదరుడు శిరీష్ తనయుడు, హీరో ఆశిష్ రెడ్డి, అద్వితా రెడ్డిల వివాహం ఇటీవల జైపూర్‌లోని లీలా ప్యాలెస్ హోటల్‌లో గ్రాండ్‌గా జరిగింది. ఈ వివాహ వేడుకకు బంధువులు, సన్నిహితులతో పాటు పలువురు సినీ ప్రముఖులు హాజరయ్యారు. ఈ జంట తమ మొదటి చిత్రాన్ని సోషల్ మీడియా లో షేర్ చేసింది. ఈ నెల 23న హైదరాబాద్‌లో రిసెప్షన్ ఏర్పాటు చేశారు దిల్ రాజు, శిరీష్. 'రౌడీ బాయ్స్' చిత్రంతో హీరోగా పరిచయమైన ఆశిష్ ప్రస్తుతం సెల్ఫిష్ చిత్రంలో నటిస్తున్నారు.

జాన్వీతో జంటగా...





ఒకప్పుడు మెగాస్టార్ చిరంజీవి, శ్రీదేవి జంట తెలుగు తెరపై ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. చిరంజీవి, శ్రీదేవిలానే రామ్‌చరణ్, జాన్వీకపూర్ కలసి నటిస్తే చూడాలనేది మెగా అభిమానుల కోరిక. గతంలో ఒకట్రెండు సందర్భాల్లో ఈ కాంబినేషన్ సెట్ చేసేందుకు ప్రయత్నాలు జరిగినా ఫలించలేదు. ఇన్నాళ్లకు ఈ క్రేజీ కాంబినేషన్ సెట్టయింది. రామ్‌చరణ్ కథానాయకుడిగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో ఓ చిత్రం (ఆర్‌సీ 16-వర్కింగ్ టైటిల్) తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. ఈ చిత్రంలో రామ్‌చరణ్‌కు జోడీగా జాన్వీకపూర్ నటించనున్నారు. ఈ విషయాన్ని జాన్వీ తండ్రి బోనీకపూర్ సోమవారం ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. 'త్వరలోనే ఆర్‌సీ 16 షూటింగ్‌లో జాన్వీ పాల్గొంటుంది. రామ్‌చరణ్ లాంటి హీరోతో నటించడం జాన్వీకి మంచి అవకాశం. నా భార్య శ్రీదేవి లానే నా కూతురు కూడా విభిన్న భాషల్లో నటించి పేరు తెచ్చుకోవాలి' అని ఆయన ఆకాంక్షించారు. అలాగే తమిళ హీరో సూర్యతోనూ జాన్వీ ఓ చిత్రంలో నటిస్తున్నట్లు బోనీకపూర్ చెప్పారు. ప్రస్తుతం ఎన్టీఆర్ సరసన జాన్వీకపూర్ 'దేవర' చిత్రంలో నటిస్తున్నారు. ఈ చిత్రంతోనే ఆమె హీరోయిన్‌గా టాలీవుడ్ అరంగేట్రం చేస్తున్నారు. శంకర్ దర్శకత్వం వహిస్తున్న 'గేమ్‌ఛేంజర్' చిత్రం షూటింగ్‌లో రామ్‌చరణ్ పాల్గొంటున్నారు. ఏప్రిల్ నుంచి 'ఆర్ సీ 16' షూటింగ్ ప్రారంభం కానుందని తెలుస్తోంది.

ఘనంగా బాఫ్టా అవార్డుల వేడుక



జొనాథన్ గ్లేజర్



సిలియన్ మర్ఫీ

ప్రతిష్ఠాత్మక 77వ బ్రిటిష్ అకాడమీ ఆఫ్ ఫిల్మ్ అండ్ టెలివిజన్ అవార్డ్స్ (బాఫ్టా) ప్రదానోత్సవం లండన్‌లోని రాయల్ ఫెస్టివల్ హాల్‌లో ఆదివారం రాత్రి వేడుకగా జరిగింది. 'ఓపెన్ హైమర్' చిత్రం మెజారిటీ పురస్కారాలను కొల్లగొట్టింది. క్రిస్టఫర్ నోలన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఉత్తమ దర్శకుడు, ఉత్తమ నటుడు (సిలియన్ మర్ఫీ), ఉత్తమ చిత్రం సహా మరో ఏడు విభాగాల్లో పురస్కారాలను గెలుచుకుంది. ఆ తర్వాతి స్థానంలో 'పూర్ థింగ్స్' చిత్రం ఐదు బాఫ్టా పురస్కారాలను గెలుపొందింది. ఉత్తమ నటిగా ఎమ్మా స్టోన్ నిలిచారు. బాలీవుడ్ కథానాయిక దీపికా పదుకొనే ఈ కార్యక్రమానికి ప్రత్యేకాకర్షణగా నిలిచారు. ఈ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆమె సహ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. దీపిక చీరకట్టులో కనిపించి వేదికపై సందడి చేశారు. 'ది జోన్ ఆఫ్ ఇంట్రెస్ట్' చిత్రం ఉత్తమ ఆంగ్లేతర చిత్రాల కేటగిరీలో విజేతగా నిలవగా, దర్శకుడు జొనాథన్ గ్లేజర్‌కు దీపికా పదుకొనే పురస్కారాన్ని అందజేశారు.

పథకం ప్రకారం సిద్ధం



సాయిరామ్ శంకర్, అసీమా నర్వాల్, శ్రుతీ సోధీ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'ఒక పథకం ప్రకారం'. వినోద్ విజయన్ దర్శకత్వం వహిస్తూ, గార్లపాటి రమేశ్‌తో కలసి నిర్మిస్తున్నారు. సాయిరామ్ శంకర్ పవర్‌ఫుల్ అడ్వకేట్ పాత్ర పోషించారు. సముద్రఖని పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని మార్చిలో విడుదల చేస్తున్నట్లు చిత్రబృందం సోమవారం ప్రకటించింది. ఈ సందర్భంగా వినోద్ విజయన్ మాట్లాడుతూ 'ఇదొక విభిన్నమైన థ్రిల్లర్. గోపీసుందర్ నేపథ్య సంగీతం సినిమాకు ప్రధాన ఆకర్షణ. సిద్ శ్రీరాం పాడిన పాటలకు ప్రేక్షకుల నుంచి చక్కటి స్పందన లభిస్తోంది' అన్నారు. భానుశ్రీ, పల్లవి గౌడ్ కీలకపాత్రలు పోషించిన ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: రాజీవ్ రవి.

ఊహించని క్లైమాక్స్‌తో...



వినూత్నమైన టైమ్ ట్రావెల్ కాన్సెప్ట్‌తో తెరకెక్కుతోన్న చిత్రం 'ఇంద్రాణి'. యానీయా భరద్వాజ్, కబీర్ దుహాన్ సింగ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. స్టీఫెన్‌పల్లం దర్శకుడిగా పరిచయమవుతున్నారు. వెరోనికా ఎంటర్టైన్‌మెంట్స్ బేనర్‌పై స్టాన్లీ సుమన్‌బాబు నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ట్రైలర్‌ను యూనిట్ విడుదల చేసింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'నా సోదరుడు చెప్పిన కథతో ఈ సినిమాను తెరకెక్కించాం. షూటింగ్ పూర్తయ్యాక వీఎఫ్ఎక్స్ కోసమే ఏడాది పాటు కష్టపడ్డాం. ఈ సినిమా క్లైమాక్స్ ఎవరూ ఊహించలేని విధంగా ఉంటుంది' అన్నారు. అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్‌తో కూడిన మంచి సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్ ఇదని నిర్మాత చెప్పారు. సినిమా ఓ దృశ్యకావ్యంలా ఉంటుంది, టైమ్ మెషీన్, రోబో ప్రేక్షకులను ఎంటర్టైన్ చేస్తాయి అని కబీర్ దుహాన్ సింగ్ తెలిపారు.

సరికొత్త కథాంశంతో...



విశ్వ కార్తిక్, ఆయూషి పటేల్ జంటగా నటించిన 'కలియుగం పట్టణం' చిత్రం షూటింగ్ పూర్తయింది. రమాకాంత్ రెడ్డిని దర్శకుడిగా పరిచయం చేస్తూ కందుల గ్రూప్ విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. చిత్రం గురించి దర్శకుడు మాట్లాడుతూ 'టాలీవుడ్‌లో ఇలాంటి కాన్సెప్ట్‌తో ఏ సినిమా రాలేదు. సరికొత్త పాయింట్‌తో సందేశాన్ని మిళితం చేసి కుటుంబ సమేతంగా చూసే విధంగా చిత్రాన్ని రూపొందించాం.. గ్యారీ బీ హెచ్ వంటి టాప్ టెక్నీషియన్ మా సినిమాకు ఎడిటర్‌గా పని చేశారు' అని చెప్పారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/sdlBUL7లో చదవండి.

ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులకు విశ్వనాథ్ అవార్డ్



మహానటుడు అక్కినేని నాగేశ్వరరావుకు, కళాతపస్వి కె.విశ్వనాథ్‌కు మధ్య ఉన్న అనుబంధం చాలా ప్రత్యేకం. అక్కినేని నటించిన ఎన్నో చిత్రాలకు విశ్వనాథ్ అసోసియేట్ డైరెక్టర్‌గా పని చేశారు. అంతేకాదు ఏయన్నార్ నటించిన 'ఆత్మగౌరవం' సినిమాతోనే ఆయన దర్శకుడిగా పరిచయమయ్యారు. వీరిద్దరి అనుబంధాన్ని స్మరించుకుంటూ అన్నపూర్ణ కాలేజ్ ఆఫ్ ఫిల్మ్ అండ్ మీడియాలో ప్రతిభ కనబర్చిన ఇద్దరు విద్యార్థులకు ప్రతి ఏడాది రెండు నగదు అవార్డులను ఇవ్వాలని విశ్వనాథ్ కుటుంబ సభ్యులు నిర్ణయించుకున్నారు. అన్నపూర్ణ స్టూడియోలోని అక్కినేని విగ్రహం దగ్గర నాగార్జున, అమలతో విశ్వనాథ్ తనయుడు నాగేంద్ర తన భార్య లక్ష్మి, కుమారుడు ప్రణవ్ కలసి సమావేశమై ఈ నిర్ణయం ప్రకటించారు. విశ్వనాథ్ సౌండ్ రికార్డిస్ట్‌గా కెరీర్ ప్రారంభించి, తర్వాత దర్శకుడు అయ్యారు కనుక ఆయన పేరిట సౌండ్ డిజైన్, డైరెక్షన్ రంగాల్లో అసాధారణమైన నైపుణ్యాన్ని ప్రదర్శించిన ఇద్దరు విద్యార్థులకు ఇకపై ప్రతి ఏడాది చెరో పాతిక వేల రూపాయలు అవార్డ్ రూపంలో అందజేస్తారు.



మలయాళంలో హిట్.. ఇప్పుడు తెలుగులో

మమ్ముట్టి ప్రధాన పాత్ర పోషించిన సైకలాజికల్ థ్రిల్లర్ 'భ్రమయుగం' ఇటీవల మలయాళంలో విడుదలై విజయం సాధించింది. చాలా కాలం తర్వాత పూర్తి బ్లాక్ అండ్ వైట్‌లో తయారైన ఈ సినిమాను సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ అధినేత సూర్యదేవర నాగవంశీ తెలుగులో విడుదల చేస్తున్నారు. ఈ నెల 23న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇందులో ఉన్న వైవిధ్యమైన కథాంశం, మమ్ముట్టి అద్భుత నటన మలయాళ ప్రేక్షకులను ఎంతో ఆకట్టుకున్నాయి. విమర్శకుల ప్రశంసలు పొందాయి. అందుకే అక్కడ ఈ సినిమాకు అద్భుతమైన స్పందన వచ్చింది. తెలుగు ప్రేక్షకులను కూడా ఈ చిత్రం అలరిస్తుందని నిర్మాత చెబుతున్నారు. అర్జున్ అశోకన్, సిద్ధార్థ్ భరతన్, అమల్డా లిజ్ తదితరులు ఇతర ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రానికి రాహుల్ సదాశివన్ దర్శకుడు.

ఫ్యాన్ రెక్కలు విరిచేందుకు ప్రజలు సిద్ధం

» ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

అద్దంకి, ఫిబ్రవరి 19: త్వరలో జరగనున్న ఎన్నికలలో ఫ్యాన్ రెక్కలు విరిచేందుకు ప్రజలు కసితో సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఈమేరకు సోమవారం ఓప్రకటన విడుదలచేశారు. సిద్ధం సభల్లో జగన్ చెప్పే మాటలన్నీ శుద్ధ అబద్ధాలు అని అన్నారు. ఎవరిది విధ్వంస పాలనో, ఎవరిది అభివృద్ధి పాలనో ప్రజలకు తెలుసునని పేర్కొన్నారు. వైసీపీ నాయకులు బూటకపు ప్రసంగాలు కాదని, చర్చించేందుకు సిద్ధమా అని ప్రశ్నించారు. 2019లో జగన్‌కు ప్రజలు ఇచ్చిన ఒక్క ఛాన్స్ రాజకీయంగా చివరి ఛాన్స్ అని చెప్పారు. ఓటమి భయం తో బదిలీలు అంటూ 77 మందిని జగన్ మడత పెట్టారని, మిగిలిన వాళ్ళను 50 రోజులలో జనం మడత పెడతారన్నారు.

వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సహజ వనరుల దోపిడీ చేస్తూ ప్రతి స్కీమ్ వెనుక స్కామ్ ఉంటుందని ఎమ్మెల్యే రవికుమార్ పేర్కొన్నారు. భారతదేశంలో అత్యంత ధనిక సీఎంగా మారిన జగన్‌కు పేదల జీవితాల గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. సామాజిక న్యాయం అనే పదం పలికే అర్హత జగన్‌కు లేదని చెప్పారు. రాయలసీమ లోని 52 నియోజకవర్గాలలో ప్రయాణికులను ఇబ్బంది పెట్టి ఆర్‌టీసీ, స్కూల్ బస్సులను లాక్కొని జనాన్ని బలవంతంగా రాప్తాడు సభకు తరలించిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికలు నిజమైన పెత్తందారు జగన్‌కు, ఐదు కోట్ల ప్రజలకు మధ్య జరుగుతున్న యుద్ధం అని చెప్పారు. జగన్‌రెడ్డి పేరు చెబితే బాబాయిపై గొడ్డలి వేటు, కోడికత్తి శ్రీను, ప్రభుత్వ టెర్రరిజం, క్విడ్‌ప్రో, ల్యాండ్, శాండ్, వైన్, మైన్ మాఫియా, దొంగ ఓట్లు, అప్పుల బాదుడు, పన్నులు, చార్జీల పెంపు, హింసా రాజకీయాలు గుర్తుకు వస్తాయన్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టులను రివర్స్ చేసి, రైతుల సబ్సిడీలు నిలిపివేసిన జగన్‌కు రాయలసీమలో సభ పెట్టే అర్హతే లేదని ఎమ్మెల్యే రవికుమార్ విమర్శించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

అద్దంకి, ఫిబ్రవరి 19: వరికోత యంత్రం, లారీ పక్కపక్కనే ఢీ కొనటంతో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. హైదరాబాద్ వైపు వెళ్తున్న వరికోత యంత్రం సోమవారం రాత్రి అద్దంకి పట్టణం సమీపంలోని నల్లవాగు వద్దకు వచ్చేసరికి వెనుకనుంచి లారీ క్రాస్ చేసే సమయంలో ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈప్రమాదంలో లారీ డ్రైవర్ వెంకటేష్‌కు తీవ్ర గాయాలు కాగా, వరికోత యంత్రంపై ఉన్న విజయకుమార్, నౌషాద్‌కు స్వల్పగాయాలయ్యాయి. 108లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి వెంకటేష్‌ను మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలుకు తరలించారు.

పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకు కృషి

పర్చూరు, ఫిబ్రవరి 19: పారదర్శకంగా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించే విధంగా కృషిచేస్తామని బాపట్ల ఆర్‌డీవో జి.రవీందర్ అన్నారు. సోమవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో బూత్‌లెవెల్ అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి పోలింగ్ బూత్‌లో పూర్తిస్థాయిలో వసతలు కల్పించే విధంగా అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. సమస్యాత్మక కేంద్రాలపై పోలీసులు దృష్టిసారించి ఎప్పటికప్పుడు సమాచారం అందించే విధంగా కార్యాచరణ రూపొందించామన్నారు. కార్యక్రమంలో పర్చూరు, కారంచేడు తహసీల్దార్‌లు సీహెచ్ సుబ్బయ్య, మెహర్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తిలో ఎనలేని గౌరవం



ఉపాధ్యాయులు మన్నం వెంకటసుబ్బారావు, ఒంగోలు ఐజాక్ డేవిడ్‌లను సన్మానిస్తున్న ఎంఈవో 2 సుధాకరరావు, కాంప్లెక్స్ చైర్‌పర్సన్ పద్మావతి, ఉపాధ్యాయులు

అద్దంకి, ఫిబ్రవరి 19: ఉపాధ్యాయ వృత్తిలో లభించే గౌరవం మరే వృత్తిలో లభించదని ఎంఈవో2 బూదాటి సుధాకరరావు అన్నారు. అద్దంకి పట్టణంలోని రామకృష్ణాపురం, ప్రకాశం ఎయిడెడ్ పాఠశాలలో పనిచేస్తూ త్వరలో ఉద్యోగ విరమణ చేయనున్న ఉపాధ్యాయులు మన్నం వెంకట సుబ్బారావు, ఒంగోలు ఐజాక్ డేవిడ్‌ను సోమవారం స్థానిక ప్రకాశం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో కాంప్లెక్స్ చైర్‌పర్సన్ పద్మావతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు కరి రామయ్య, టంగుటూరి ప్రకాశం, ఆదినారాయణ, గంగాధర్ , పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంకొల్లు తహసీల్దార్‌గా ప్రమీల

ఇంకొల్లు, ఫిబ్రవరి 19: ఇంకొల్లు తహసీల్దార్‌గా ఎం.ప్రమీల సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఉమ్మడి గుంటూరు జిల్లా నగరంలో పనిచేస్తూ ఇంకొలుకు బదిలీ అయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని ప్రజలకు అందుబాటులోఉండి రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని చెప్పారు.

బీసీల అభివృద్ధే కమిషన్ లక్ష్యం



అద్దంకిలోని బీసీ బాలికల వసతి గృహంలో భోజనం చేస్తున్న కమిషన్ సభ్యులు గురవాచారి

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 19: బీసీల అభివృద్ధి, సంక్షేమం కోసం కమిషన్ పని చేస్తుందని ఆంధ్రప్రదేశ్ బీసీ కమీషన్‌సభ్యులు కుందుర్తి గురవాచారి అన్నారు. సోమవారం సాయంత్రం అద్దంకి వచ్చిన ఆయన్ని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో పలు బీసీ సంఘాల సభ్యులు కలిసి స్వాగతం పలికారు.

అనంతరం అద్దంకిలోని బీసీ బాలికల వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలను లిఖితపూర్వకంగా తెలుసుకున్నారు. బీసీల సమస్యలను సభ్యులతో చర్చించి వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. ఏమన్నా సమస్యలు ఉంటే కమిషన్ దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు చెన్నుపల్లి శ్రీనివాసచారి, సురేష్, సామ్రాజమ్మ, పొన్నపల్లి బ్రహ్మానందం, సీతారామాంజనేయులు, రవిచంద్రచారి, వీ రయ్య తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పతనం ఖాయం

» ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు



ఎన్టీఆర్ విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యేలు ఏలూరి, స్వామి

గంగవరం(ఇంకొల్లు), ఫిబ్రవరి 19: రాష్ట్రంలో అరాచక, విధ్వంస పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వం పతనం ఖాయమని టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. సోమవారం ఇంకొల్లు మండలం గంగవరంలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ, టీడీపీ నూతన కార్యాలయాన్ని ఎమ్మెల్యే ఏలూరి, కొండపి ఎమ్మెల్యే స్వామి ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈసందర్భంగా ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ వచ్చే ఎన్నికలలో వైసీపీ ఫ్యాన్ రెక్కలు విరిచేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. రాష్ట్ర రాజకీయాల్లో మార్పుతీసుకొచ్చిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్ అని కొనియాడారు. ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చి కీర్తి ప్రతిష్టలు గడించారన్నారు. పేదల జీవితాల్లో వెలుగు నింపారన్నారు.ఎన్టీఆర్ కలల సాధనకు కలిసికట్టుగా పని చేయాలని చెప్పారు. గత పదేళ్లలో పర్చూరు నియోజకవర్గంలో వైసీపీకి పది మంది ఇన్‌చార్జ్‌లు మారారన్నారు. ఓటమి భయంతోనే జర్నలిస్టులపై దాడులు చేస్తున్నారని అన్నారు.

కొండపి ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి మాట్లాడుతూ అరాచక పాలన చేస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. తెలుగుదేశం పార్టీని గెలిపించి పసుపు జండా ఎగురవేయాలనే కసి ప్రజల్లో కనిపిస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో పర్చూరు నియోజవర్గంలో ఏలూరి సాంబశివరావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నాయుడు హనుమంతరావు, డాక్టర్ బోడాల శ్యాంసుందర్, పాలేరు రామకృష్ణ, బేతపూడి సురేష్, వీరగంధం, గుంజి వెంకట్రావు, వలేరుమార్క్, కరి వీరాంజనేయులు, బోడెంపూడి సుబ్బారావు, బోడెంపూడి నాగేశ్వరరావు, కొల్లి సుబ్బారావు, బోడెంపూడి వెంకటేశ్వర్లు, నాదెండ్ల రామకృష్ణ, రావిపాటి సంధ్య, కరి నాగేంద్రమ్మ, ఆడె విజయలక్ష్మి, కీసర వీరారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

» రూ.లక్ష నగదు, 60 సవర్ల నగలు అపహరణ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న సీఐ కృష్ణయ్య

అద్దంకి, ఫిబ్రవరి 19: తాళం వేసిఉన్న బ్యాంక్ ఉద్యోగి ఇంట్లో చోరీ జరిగి నగదు, బంగారం ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. బాధితుల కథనం మేరకు.. అద్దంకి పట్టణంలోని న్యూఎస్‌బీఐ కాలనీలో ఎస్‌బీఐలో పనిచేసే పెద్ది అరవింద్ నివాసం ఉంటున్నాడు. భార్య నాగలక్ష్మి బల్లికురవ మండలంలో ఉపాధ్యాయరాలుగా పనిచేస్తుంది. శనివారం సాయంత్రం కుటుంబసభ్యులందరూ కొరిశపాడు మండలం కు ర్రావానిపాలెం వెళ్ళారు. ఆదివారం రాత్రి అద్దంకి రావాలని ప్రయత్నించినప్పటికీ అరవింద్ ఒంగోలు నుంచి ఆలస్యంగా రావటంతో రాలేకపోయారు. సోమవారం ఉదయం వచ్చి చూసేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంటి తలుపుల తాళాలు పగులగొట్టి బీరువా తెరిచి ఉన్నాయి. రెండు బెడ్ రూమ్‌లలో కప్‌బోర్డులలో దుస్తులు, వస్తువులు చిందరబందరగా పడవేసి ఉన్నాయి. పెళ్లిళ్లకు హాజరుకావాల్సి ఉండటంతో బ్యాంక్ లాకర్‌లో ఉన్న బంగారం మొత్తం ఇటీవలనే తెచ్చి ఇంట్లో ఉంచినట్లు తెలుస్తుంది. దీంతో సుమారు లక్ష రూపాయల నగదు, 60 సవర్ల బంగారం ఆభరణాలు చోరీ జరిగినట్లు బాధితులు తెలిపారు. సంఘటనాస్థలాన్ని సీఐ కృష్ణయ్య పరిశీలించారు. క్లూస్ టీమ్ బృందం పరిశీలించి ఆయా వస్తువులపై వేలిముద్రలు సేకరించారు.

చోరీకి పాల్పడేందుకు వచ్చిన యువకుడి కదలికలు న్యూఎస్‌బీఐ కాలనీలో ఓ ఇంటి వద్ద, ఎస్ఎస్ లాడ్జి వద్ద ఉన్న సీసీ కెమెరాలలో రికార్డు అయ్యాయి. న్యూ ఎస్‌బీఐ కాలనీలో ఓ ఇంటి వద్ద ఉన్న సీసీ కెమెరాలో ఆ యువకుడు కదలికలు రికార్డు అ య్యాయి. ప్రహరీ గోడ దూకి ఇంటి లోపలకు వెళ్లిన దొంగ వెంటనే బయటకు వచ్చాడు. పక్క బజారులో తాళం వేసి ఉన్న అరవింద్ ఇంట్లో చోరీకి పాల్పడ్డాడు. లాడ్జి వద్ద ఉన్న సీసీ కెమెరాలో పరిశీలించగా బ్యాగ్ తగిలించుకున్న ఓ యువకుడు అర్ధరాత్రి సమయంలో నామ్ రోడ్డులో లారీ నుంచి దిగి న్యూ ఎస్‌బీఐ కాలనీలోకి వెళ్ళాడు. తాళాలు వేసి ఉన్న ఇళ్ళను పరిశీలించి చోరీకి పాల్పడ్డాడు. పై అంతస్తులో మనుషులు ఉన్నా మూడు తలుపుల తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

సీఎం జగన్.. ఓడిపోవడానికి సిద్ధంగా ఉండు..!

» టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొండయ్య



మాట్లాడుతున్న కొండయ్య

చీరాల, ఫిబ్రవరి 19: సీఎం జగన్ సిద్ధం అంటున్నారు, నిజమే.. ప్రజలు కూడా మిమ్మల్ని ఓడించడానికి సిద్ధంగా ఉన్నారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ నియంత, అరాచక పోకడలు పెట్రేగిపోతున్నాయన్నారు. రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ గూండాల దాడి పరాకాష్టన్నారు. ఆ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. స్థానిక ఎమ్మెల్యే బలరామకృష్ణమూర్తి టీడీపీ అధినేత చంద్రబాబుపై చేసిన వ్యాఖ్యలు పూర్తి అభ్యంతరకమరన్నారు. వాటిని ఖండిస్తున్నట్టు చెప్పారు. లోకేష్ ఓటమిపై మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. కొన్ని సందర్భాల్లో అనేక పరిస్థితుల ప్రభావం ఉంటుందన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. మీరు వైసీపీకి మద్దతు తెలిపిన తరువాత కూడా టీడీపీ శ్రేణులకు మీరు, మీ క్యాడర్ పరిస్థితులకు అనుగుణంగా మరలా టీడీపీకి వస్తామని చెప్పిన సందర్భాలు ఉన్నాయన్నారు. ఆక్రమంలో చంద్రబాబు ఇంకొల్లు సభలో మాట్లాడటం సమంజసమే కదా అని అన్నారు. లేదంటే మీరు రాజీనామా చేసి తిరిగి గెలుపొంది ఉంటే మిమ్మల్ని చంద్రబాబు ఏమీ అనేవారు కాదన్నారు. చీరాల నియోజకవర్గంలో 2014 నుంచి 2019 వరకు టీడీపీ హయాంలో రూ.700 కోట్లు విలువైన అభివృద్ధి పనులు చేసినట్లు రికార్డుల పరంగా ఉందని చెప్పారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏం చేశారో చెప్పాలన్నారు. సీఎం జగన్ ఒక బటన్ నొక్కి రూ.10లు ఇస్తే, మరో బటన్ నొక్కి జనాలకు తెలియకుండానే రూ.100 లాగేసుకుంటున్నారన్నారు. అభివృద్ధిలో పోటీ పడాలేకాని అరాచకాల్లో కాదన్నారు.

సమావేశంలో నాయకులు కొతవరపు జనార్దనరావు, గంజి పురుషోత్తమ్, బొగ్గుల పార్థసారధి, గజవల్లి శ్రీనివాసరావు, శ్రీనివాస్‌తేజ, రమేష్, సయ్యద్‌బాబు, పులిపాటి శేఖర్, శామ్యూల్, రామయ్య, మోహన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఏలూరి సమక్షంలో పార్టీలో చేరిన పూనూరు వైసీపీ నాయకులు

టీడీపీలో చేరిన పూనూరు వైసీపీ నాయకులు

యద్దనపూడి(మార్టూరు), ఫిబ్రవరి 19: యద్దనపూడి మండలం పూనూరు గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు సోమవారం టీడీపీలో చేరారు. మార్టూరు మండలం ఇసుకదర్శిలోని ఏలూరి క్యాంపు కార్యాలయంలో వైసీపీ మద్దతుదారులైన 8వ వార్డు మెంబరు పావులూరి హరిబాబు, బొల్లినేని రామసుబ్బయ్యతో పాటు పలువురు ఎమ్మెల్యేను కలిశారు. వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు బోయపాటి సాంబయ్య, బత్తుల రాము, ఈదల అనిల్, ఈదల రవి, మండవ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌పై దాడి అమానుషం

» పలుచోట్ల నిరసనలు



చీరాలలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న విలేకరులు, వామపక్షాల ప్రతినిధులు



మార్టూరు స్టేషన్ హౌస్ ఆఫీసర్ రాజశేఖర్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

చీరాలటౌన్, ఫిబ్రవరి 19: ముఖ్యమంత్రి సభలోనే జర్నలిస్టుపై దాడి జరగటం అమానుషమని పలువురు విలేకరులు పేర్కొన్నారు. ఇలాంటి సంఘటనలు సినిమాల్లో మాత్రమే చూశామని, నేడు అంతకు మించి దారుణ ఘటనలు ప్రత్యక్షంగా చోటుచేసుకుంటున్నాయని చెప్పారు. అనంతపురం జిల్లా రాప్తాడులో సీఎం సభ కవర్ చేస్తున్న ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ కార్యకర్తలు దాడిచేసి తీవ్రంగా గాయపరిచారని అన్నారు. ఈక్రమంలో సోమవారం చీరాలలో పెద్ద ఎత్తున జర్నలిస్టులు, టీడీపీ, జనసేన, సీపీఐ, సీపీఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ముందుగా ముక్కోణం పార్క్ కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి వినతిపత్రం అందజేశారు. అనంతరం ర్యాలీగా గడియార స్తంభం సెంటర్‌కు చేరుకుని మానవహారం నిర్వహించారు. తహసీల్దార్ నాసరయ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో విలేకరులు రావిపాటి శ్రీనివాస్, కోంద్రు కిరణ్, శేషసాయి, నాగరాజు, స్వామినాద్, చంద్రశేఖర్, వాసు, దిలీప్, అవ్వారు అనీల్, బెజ్జం మణి, బాషా, కమలాకర్, ఒంటరి మణి, సూర్య, నెహేమియా, దుర్గా, టీడీపీ నాయకులు అమర్నాద్, గజవల్లి శ్రీను, తేజ, మోహన్‌గౌడ్, జనసేన నాయకులు గూడూరి శివరామప్రసాద్, శ్రీను, సీపీఐ, సీపీఎం నాయకులు బాబురావు, కొండయ్య, వసంతరావు, ప్రజాసంఘాల నాయకులు గుమ్మడి ఏసురత్నం, బాబు, జిలానీ తదితరులు పాల్గొన్నారు.

మార్టూరులో.. మార్టూరు, ఫిబ్రవరి 19: అనంతపురం జిల్లా రాప్తాడులో ఆదివారం జరిగిన ముఖ్య మంత్రి సభలో ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీకి చెందిన వ్యక్తులు దాడి చేసిన ఘటనను మార్టూరు యద్దనపూడి మండలాల ప్రింటింగ్, ఎలక్ట్రానిక్ జర్నలిస్టులు ఖండించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అలాగే, స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎస్సై రాజశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జర్నలిస్టులు దాసం బాలభాస్కర్, కె.రాజ్‌కుమార్, షఫీ, పుట్టా అయ్యన్నబాబు, బెన్నీ, విజయ్, గడ్డం మస్తానవలి, కొల్లా శ్రీను, జె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పర్చూరులో.. పర్చూరు, ఫిబ్రవరి 19: జర్నలిస్టుపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై విచక్షణారహితంగా చేసిన దాడిపై పర్చూరులో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు నిరసన తెలిపారు. నల్లబ్యాడ్జీలతో స్థానిక బొమ్మల సెంటర్‌లో దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జర్నలిస్టు ప్రతినిధులు రామకృష్ణంరాజు, కొండపాటూరి సుబ్బారావు, తులసి రాఘవరావు, బిరుదు నాగేశ్వరరావు, కొమ్మాలపాటి రవికుమార్, షేక్ అయూబ్, గండు శ్రీనివాసరావు(వాసు), షేక్ బాషా తదితరులు పాల్గొన్నారు.

చినగంజాంలో.. చినగంజాం, ఫిబ్రవరి 19: ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై జరిగిన దాడిని ప్రతిఒక్కరూ ఖండించాలని చినగంజాం మండల ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకుడు జి.ప్రతాప్‌కుమార్ అన్నారు. రాప్తాడులో ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై మూకుమ్మడిగా జరిగిన దాడి అమానుషమన్నారు. అక్కడ ఉన్న పోలీసుల సమక్షంలో ఈ దాడి జరగడం గర్హనీయమన్నారు. మండల ప్రజాసంఘాల నాయకులు, విలేకరులు డిప్యూటీ తహసీల్దార్ ఎం.సుబ్బారావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో విలేకరులు కె.శ్రీనివాసరావు, కుక్కల శివారెడ్డి, నాగూర్ బాబు, తదితరులు పాల్గొన్నారు.



చినగంజాం: డీటీకి వినతిపత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు, విలేకరులు



పర్చూరు బొమ్మల సెంటర్‌లో దాడిని ఖండిస్తూ నినాదాలు చేస్తున్న జర్నలిస్టులు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ ప్రసాదరావు

పారదర్శకంగా ఎన్నికల విధులు నిర్వహించాలి

చీరాలటౌన్, ఫిబ్రవరి 19: సార్వత్రిక ఎన్నికల విధులను సిబ్బంది పారదర్శకంగా నిర్వహించాలని డీఎస్పీ ప్రసాదరావు పేర్కొన్నారు. ఎన్నికలకు సంబంధించి సోమవారం స్థానిక వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాలలో సబ్‌డివిజన్ పరిధిలోని పోలీసు సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కోడ్ ఆఫ్ కండక్ట్ రూల్స్ కచ్చితంగా పాటించాలన్నారు. ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు కృషి చేయాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. బ్యాలెట్ పేపర్‌లు, ఈవీఎం, వీవీప్యాట్ ఇతర పోలింగ్ పరికారాల భద్రతకు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సీఐలు శేషగిరిరావు, సోమశేఖర్, సత్యనారాయణ, శ్రీనివాసరావు, కృష్ణయ్య, శివరామకృష్ణారెడ్డి, సబ్‌డివిజన్ పరిధిలోని ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

22న కేఆర్‌కేలో అవగాహన సదస్సు

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 19: శింగరకొండ వద్ద గల కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంగ్లీష్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో జవహర్ నాలెడ్జి సెంటర్ సహకారంతో ఈనెల 22వ తేది ఉదయం 10 గంటలకు ఇంగ్లీష్ లాంగ్వేజ్ అండ్ లిటరేచర్- కెరీర్ ప్రోస్పెక్ట్స్ అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వి.మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. అద్దంకి, పరిసర ప్రాంతాలలో ఇంటర్, డిగ్రీ చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలన్నారు.

ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే ఏలూరి



ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే ఏలూరి

చినగంజాం, ఫిబ్రవరి 19: మండలంలోని నీలాయపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు విగ్రహాన్ని టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సోమవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సినీ పరిశ్రమలో, రాజకీయాల్లో మకుటం లేని రారాజుగా నిలిచిన ఏకైక వ్యక్తి ఎన్టీఆర్ అని అన్నారు. తెలుగుజాతి గొప్పదనాన్ని ప్రపంచ నలుమూలల చాటిచెప్పిన వ్యక్తి అని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీరయ్య, నీలాయపాలెం సర్పంచ్ తూమాటి శ్రీనివాసరావు, ఆసోది సుబ్బారెడ్డి, వడ్లమూడి వెంకయ్య, ఎ.సురేంద్రబాబు, తూమాటి ఆదినారాయణ, యార్లగడ్డ లక్ష్మీ, వడ్లమూడి సత్యనారాయణ, దండుప్రోలు తిరుపతిరావు, బొమ్మిడి పిచ్చయ్య, బాలరాజు, నాంచార్యులు తదితరులు పాల్గొన్నారు. ముందుగా సర్పంచ్ తూమాటి శ్రీనివాసరావు కుమారుడు వివాహం సందర్భంగా నూతన వధూవరులను ఎమ్మెల్యే ఏలూరి ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలి

పర్చూరు, ఫిబ్రవరి 19: పర్చూరులోని శ్రీఅద్దంకి నాంచారమ్మ అమ్మవారి కల్యాణ మండపంలో ఈనెల 25న నిర్వహించనున్న నియోజకవర్గస్థాయి ముస్లిం మైనారిటీ ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ జమాలుద్దీన్ పిలుపు నిచ్చారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాల యంలో జరిగిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. సమావేశంలో మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ అబ్దుల్ రజాక్, అధికార ప్రతినిధి రఫీ, నియోజకవర్గ అధ్యక్షుడు షేక్.రసూల్, మండల ప్రధానకార్యదర్శి షేక్ ఖాసీం, అబ్దుల్ కలాం ఆజాద్, ఏఎంసీ మాజీ ఛైర్మన్ చిట్టినేని రామకృష్ణ, పట్టణ పార్టీ అధ్యక్షుడు అగ్నిగుండాల వెంకటకృష్ణారావు, షేక్ హుస్సేన్(ట్విన్స్), సుభానీ, జానీ, శాసనమండలి మాజీ ఛైర్మన్ ఎంఏ షరీఫ్, మౌలానా ముస్తాక్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మయ్య కుటుంబసభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే బలరాం

బల్లికురవ, ఫిబ్రవరి 19: బల్లికురవ గ్రామానికి చెందిన మండల టీడీపీ నాయకుడు గొట్టిపాటి లక్ష్మయ్య భార్య అనురాధ ఇటీవల గుండెపోటుతో మృతి చెందింది. సోమవారం చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి లక్ష్మయ్య కుటుంబసభ్యులను పరామర్శించారు. అలాగే, చెన్నుపల్లి గ్రామంలో హైకోర్టు మాజీ జడ్జి రజని తండ్రి తేలప్రోలు వెంకటప్పయ్యను బలరాం పరామర్శించారు. ఈసందర్భంగా అయన యోగక్షేమాలను అడిగి తెలుసుకొన్నారు. బలరాం వెంట పలువురు నేతలు ఉన్నారు.

కొణిదెనలో వైద్య శిబిరం



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి రాజ్‌కుమార్

బల్లికురవ, ఫిబ్రవరి 19: కలెక్టర్ రంజిత్ బాషా ఆదేశాలతో సోమవారం మండలంలోని కొణిదెన గ్రామంలో గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి రమీజ్ అహ్మద్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. గత వారంలో బల్లికురవలో జరిగిన కలెక్టర్ స్పందన కార్యక్రమంలో కొణిదెన ఎస్సీ కాలనీవాసులు గ్రామంలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండటంతో జ్వరాల బారినపడుతున్నట్లు ఫిర్యాదు చేశారు. దీంతో వైద్య సిబ్బంది శిబిరం ఏర్పాటుచేసి ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ శిబిరాన్ని జిల్లా మలేరియా అధికారి రాజ్‌కుమార్ పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

అలాగే, చీరాల డీవిజన్ డీఎల్‌పీవో హనుమంతరావు గ్రామంలో పారి శుధ్య పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సుమతి, పంచాయ తీ కార్యదర్శి ప్రసాదరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాలుడు మృతి బాధాకరం

పర్చూరు, ఫిబ్రవరి 19: పర్చూరు ఇందిరా కాలనీలో నివాసం ఉంటున్న షేక్ మౌలాలి(అడితి) కుమారుడు (14) మృతి చెందటంతో సోమవారం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు నివాళులర్పించారు. బాలుడు మృతి కుటుంబ సభ్యులకు తీరని లోటన్నారు. బాలుడు మృతి తనను ఎంతగానో కలచివేసిందన్నారు. కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. నివాళులర్పించినవారిలో టీడీపీ మండల అధ్యక్షుడు షేక్ షంషుద్దీన్, పట్టణ అధ్యక్షుడు అగ్నిగుండాల వెంకటకృష్ణారావు, మైనార్టీసెల్ నాయకులు, స్థానిక నేతలు ఉన్నారు.

వేగం కన్నా ప్రాణం మిన్న

చీరాల, ఫిబ్రవరి 19: వేగం కన్నా ప్రాణం మిన్న అని ఎంవీఐ రామకృష్ణారెడ్డి అన్నారు. స్థానిక 216 జాతీయ రహదారి పక్కనున్న ఎంవీఐ కార్యాలయ ప్రాంగణంలో సోమవారం 35వ జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, నిర్ణీత వేగంతో వాహనాలు నడిపితే ఎలాంటి ప్రమాదాలు జరగవన్నారు. ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనచోదకులు సీటు బెల్ట్ ధరించాలన్నారు. ప్రమాదం జరిగితే 108 వాహనం వచ్చే లోపు అందుబాటులో ఉన్నవారు క్షతగాత్రులకు ప్రాథమిక చికిత్స ఎలా చేయాలనేది డాక్టర్ నరేంద్ర వివరించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది జ్యోతి, నాగూర్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.